




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక






సంపుటి: 5 సంచిక: 65, పేజీలు - 08

శుక్రవారం, ఆగష్టు 8, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## ధర్మస్థల కేసులో కీలక పరిణామం

### - తవ్వకాల్లో పురుషుడి అస్థిపంజరం లభ్యం



ధర్మస్థల (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ధర్మస్థల సామూహిక ఖననాల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) జరుపుతున్న తవ్వకాల్లో పురుషుడి అస్థిపంజరంతో పాటు పలు మానవ ఎముకలు లభ్యమైనట్లు కర్ణాటక హోంశాఖ మంత్రి జి. పరమేశ్వర తొలిసారి అధికారికంగా ధృవీకరించారు. గురువారం నాడు బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన హోంమంత్రి

2లో..

## జమ్మూకాశ్మీర్‌లో లోయలో పడిన సీఆర్‌పీఎఫ్ బస్సు

### - ముగ్గురు జవాన్లు మృతి



శ్రీనగర్ (ప్రశ్న న్యూస్) జమ్మూ కాశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. సుమారు 23 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న ఒక బస్సు లోయలో పడిపోవడంతో ముగ్గురు జవాన్లు దుర్మరణం చెందారు. ఈ ఘటనలో మరో 15 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. బసంత్‌గఢ్

2లో..

## క్యూ కడుతున్న విదేశీయులు

### - అంతర్జాతీయ మెడికల్ టూరిజం హబ్ గా భారత్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నాణ్యమైన వైద్య సేవలకు భారతదేశం ప్రపంచస్థాయి చిరునామాగా మారుతోంది. వైద్యం కోసం మన దేశానికి వస్తున్న విదేశీ పర్యాటకుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లోనే (ఏప్రిల్ వరకు) 1,31,856

2లో..

## సంపాదనతో కలగని సంతృప్తి

## సాయం చేస్తే వస్తుంది

- విజయవాడలో పారిశ్రామికవేత్తలతో సీఎం చంద్రబాబు సమావేశం
- పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని వ్యాపారవేత్తలకు పిలుపు
- సాయం చేసేందుకు ఆసక్తి ఉన్న వారి కోసం కో-స్పాన్సర్ విధానం ప్రకటన



అమరావతి (ప్రశ్న న్యూస్) సంపాదనతో లభించని అసలైన సంతృప్తి, సమాజానికి సాయం చేసినప్పుడే కలుగుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గతంలో పారిశ్రామికవేత్తలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టమని అడిగానని, ఇప్పుడు పెట్టుబడులతో పాటు పేదలకు అండగా నిలవాలని కోరుతున్నానని ఆయన పేర్కొన్నారు. విజయవాడలోని

2లో..



## రిజర్వేషన్ల పెంపుపై

# ఆశల్లేనట్లే

### పాత కోటాతోనే ఎన్నికలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్ నెలాఖరులోపు పూర్తి చేయాలని కోర్టు డెడ్ లైన్ పెట్టింది. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకు వచ్చిన రిజర్వేషన్ల బిల్లు, ఆర్డినెన్స్ ఆమోదం పొందలేదు. ఢిల్లీలో ధర్నా చేసిన సీఎం రేవంత్ ప్రధానిగా రాహుల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలకు 42 శాతం కోటా ఇస్తామని ప్రకటించారు. అంటే ఇప్పుడు రిజర్వేషన్లకు అవకాశం లేదని ప్రభుత్వం కూడా నిర్ణయానికి వచ్చినట్లే అనుకోవచ్చు. మరి ఇప్పుడు స్థానిక ఎన్నికల విషయంలో సీఎం రేవంత్ ఏం చేయబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది.

#### తమ ఎదుట మూడు ఆప్షన్లు ఉన్నాయంటున్న రేవంత్

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్రపతి నుండి ఎలాంటి స్పందన లేనందున సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని సీఎం రేవంత్ అంటున్నారు. మా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే, ఇక్కడి వరకు వచ్చామమని ప్రస్తుతం ప్రభుత్వం ముందు మూడు ఆప్షన్లు ఉన్నాయని రేవంత్ అంటున్నారు. అందులో ఒకటి కేంద్రం ఆమోదం తెలిపే వరకు వేచి చూడాలి. ఇప్పుడల్లా ఆమోదిస్తారన్న నమ్మకం లేదు. స్థానిక ఎన్నికలు నిర్వహించి తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో ఇక జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లడం. అయితే జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్తే అది న్యాయపరమైన వివాదాల్లో ఇరుక్కుంటుంది. దీని వల్ల స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమవుతాయి.

#### పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలుక వెళ్లే యోచన

మూడో ఆప్షన్ గా 42 శాతం బీసీలుక రిజర్వేషన్ పార్టీ పరంగా ఇచ్చి ఎన్నికలకు వెళ్ళడమని రేవంత్ అన్నారు. ప్రభుత్వం జీవో ఇచ్చి ఎన్నికలకు ఎవరైనా కోర్టుకు పోతే స్టే ఇస్తుంది. రిజర్వేషన్ గురించి అబద్ధపు హామీలు ఇచ్చి నేను ఎన్నికలకి నేను పోలేనన్నారు. సెప్టెంబర్ 30 కల్లా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలి కోర్టు తీర్పు ఉన్న నేపథ్యంలో ఎలా ముందుకు వెళ్ళాలన్నదానిపై చర్చిస్తున్నామన్నారు. తొందరలోనే పీఏసీ సమావేశం ఏర్పాటు చేస్తాం చర్చ చేస్తామని, గ్రామాల్లో ఎలా ఉంది పరిస్థితి అనేది

2లో..

## ఈసీ చేతిలో

## ప్రజాస్వామ్యం ఖూనీ

### - రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు

- ఈసీ, బీజేపీ కుమ్మక్కయ్యాయన్న రాహుల్ గాంధీ
- ఎన్నికల ప్రక్రియను ఈసీనే నీరుగారుస్తోందని ఆరోపణ
- మహారాష్ట్రలో 5 నెలల్లో కోటి ఓట్లు పెరగడంపై ప్రశ్నలు




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)పై కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఈసీ ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే సంస్థగా కాకుండా, దాన్ని ఓ క్రమపద్ధతిలో కూల్చివేయడానికి సహకరిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. బీజేపీతో ఈసీ కుమ్మక్కై ఎన్నికల ప్రక్రియను పూర్తిగా తారుమారు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా విశ్వసనీయతపై ఆయన తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. "అసలు ఓటర్ల జాబితా కచ్చితంగా

2లో..

## మూడేళ్లలో

## అధికారంలోకి వస్తాం

### - ఆ అధికారుల భరతం పడతాం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని ఇచ్చిన హామీలను విస్మరించిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలాంటి ఫలితాలు సాధించలేకపోయారని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన వెంటనే రైతుబంధు పథకాన్ని నిలిపివేయడానికి కాంగ్రెస్ కేబినెట్‌లో చర్చలు జరిపారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధు నిలిచిపోతుందని కేసీఆర్ గతంలోనే చెప్పారని

2లో..

## బనకచర్లపై

## కేంద్రం సంచలన నిర్ణయం

### 12 మందితో నిపుణుల కమిటీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) బనకచర్ల ప్రాజెక్టుపై నిపుణుల కమిటీ ఏర్పాటుకు కేంద్ర జలశక్తి శాఖ కసరత్తు చేస్తోంది. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య వివాదాస్పదంగా మారింది. అందుకే సాంకేతిక, ఆర్థిక అంశాలను అధ్యయనం చేయడానికి 12 మంది సభ్యులతో ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ కమిటీలో ఏపీ, తెలంగాణ నుంచి ఐదుగురు నిపుణుల చొప్పున పేర్లను

2లో..

## చేనేతలకు చంద్రబాబు బంపర్ ఆఫర్

- ప్రతి చేనేత కుటుంబానికి ఏటా రూ.25 వేలు 'నేతన్న భరోసా' కింద సాయం
- చేనేత మగ్గాలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు
- చేనేత ఉత్పత్తులపై 5% జీఎస్టీ రీయింబర్స్‌మెంట్
- ప్రగడ కోటయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు నిర్ణయం

గుంటూరు (ప్రశ్న న్యూస్) 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని చేనేత కార్మికులపై వరాల జల్లు కురిపించారు. చేనేత కార్మికుల ఆదాయం రెట్టింపు అయ్యేలా చూసే బాధ్యత తనదేనని వెల్లడించారు. చేనేత మగ్గాలు ఉన్నవారికి, పవర్ లూమ్‌లకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని తేల్చి చెప్పారు. కొత్త డిజైన్లపై చేనేత కార్మికులకు ట్రైనింగ్ ఇచ్చి వారి ఆదాయాన్ని మరింత పెంచేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు. చేనేతపై జీఎస్టీని కూడా రీయంబర్స్ చేస్తామని చేనేత కార్మికులకు

2లో..




## రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం తెలంగాణ ప్రజల్ని అవమానించడమే

### - రేవంత్ కీలక ఆరోపణలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ఆమోదించకుండా అడ్డుకుంటోందని మరోసారి సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ కోసం అపాయింట్‌మెంట్ కోరినా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒత్తిడి కారణంగా అది దక్కలేదని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఈ అంశంపై మీడియాతో

2లో..

## యువత వారానికి ఒక్కసారైనా

## చేనేత వస్త్రాలు ధరించాలి

- ఆప్కో కొనుగోళ్లపై 5 శాతం జీఎస్టీ రాయితీ
- నేతన్నల కోసం త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటుకు నిర్ణయం
- చేనేతకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ



అమరావతి (ప్రశ్న న్యూస్) జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేత కార్మికులకు శుభవార్త చెప్పింది. చేనేత రంగానికి అండగా నిలుస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఇందులో భాగంగా చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, చేనేత కళ మన దేశ సంస్కృతికి, స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీక అని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో..

## హైదరాబాద్‌లో

## కుండపోత

- హైదరాబాద్‌లో భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని నగర ప్రజలకు విజ్ఞప్తి
- లోతట్టు ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశం
- రాష్ట్రంలోని పలు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచన


2లో..



## పుతిన్‌తో అజిత్ దోవల్

## కీలక సమావేశం

- భారత్-రష్యా వ్యూహాత్మక బంధంపై ప్రధానంగా చర్చలు
- ఈ ఏడాది చివర్లో పుతిన్ భారత పర్యటనకు సన్నాహాలు
- పుతిన్ పర్యటన తేదీల ఖరారుపై ఇరు దేశాల కసరత్తు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్-రష్యా మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా పర్యటనలో ఉన్న భారత జాతీయ భద్రతా

2లో..

# ధర్మస్థల కేసులో కీలక పరిణామం

పరమేశ్వర, ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. "ఒక గుర్తుతెలియని వ్యక్తి తాను 13 ప్రాంతాల్లో మృతదేహాలను పాతిపెట్టినట్లు ఫిర్యాదు చేశాడు. అతని వాంగ్మూలం ఆధారంగా సిట్ బృందాలు ఆ ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టాయి. ఆరో ప్రదేశంలో ఒక పురుషుడి అస్థిపంజరం దొరికింది. దీంతో పాటు మరో కొత్త ప్రదేశంలోనూ కొన్ని ఎముకలు లభ్యమయ్యాయి. లభ్యమైన అన్ని అవశేషాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి (ఎఫ్ఎస్ఎల్) పంపాం" అని ఆయన స్పష్టం చేశారు. 13వ స్థానంలో మాత్రం ఇంకా ఏమీ దొరకలేదని ఆయన తెలిపారు. ఫిర్యాదుదారుడు మెజిస్ట్రేట్ ముందు సెక్షన్ 164 కింద వాంగ్మూలం ఇస్తూ, తాను వందల సంఖ్యలో మృతదేహాలను పూడ్చిపెట్టినట్లు చెప్పడంతో ప్రభుత్వం ఈ కేసును తీవ్రంగా పరిగణించి సిట్ ఏర్పాటు చేసిందని పరమేశ్వర గుర్తుచేశారు. దర్యాప్తులో ప్రభుత్వం ఎలాంటి జోక్యం చేసుకోదని, శాస్త్రీయంగా, సాంకేతిక పరిజ్ఞానంతో నిజానిజాలు నిగ్గు తేల్చాలని సిట్‌కు పూర్తి స్వేచ్ఛనిచ్చామని ఆయన వివరించారు.

## జమ్మూకాశ్మీర్‌లో లోయలో పడిన సీఆర్‌పీఎఫ్ బస్సు

ప్రాంతంలోని కాండ్వా సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ వార్త తెలిసిన వెంటనే పోలీసులు, స్థానిక అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన జవాన్లను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గురువారం రోజు ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. 187వ బెటాలియన్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్లు బసంత్‌గఢ్ నుంచి ఒక ఆపరేషన్ ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మృతి చెందిన ఇద్దరు జవాన్లు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా మరో వ్యక్తి చికిత్స పొందుతూ మరణించారు. దీంతో మృతుల సంఖ్య మూడుకు చేరుకుంది. మరో 14 మంది తీవ్ర గాయాలపాలై ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఇందులోనూ పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. అలాగే మృతుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఈ ఘటనపై జమ్మూ-కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశానికి సేవ చేస్తూ ప్రాణాలు కోల్పోయిన జవాన్ల సేవలను ఎప్పటికీ మర్చిపోలేమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూనే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఉన్నతాధికారులను అప్రమత్తం చేసి, క్షతగాత్రులకు ఉత్తమ వైద్య సదుపాయాలు అందేలా చూడాలని ఆయన ఆదేశించారు. ఇలాంటి ప్రమాదాలు ఈ ప్రాంతంలో తరచుగా జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లోని రోడ్లు ఇరుకుగా ఉండటం, వాతావరణ పరిస్థితులు అస్థిరంగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు ఈ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. బస్సు అదుపుతప్పడానికి గల కారణం ఇంకా తెలియరాలేదు. టెర్రరిస్టుల కార్యకలాపాలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తుంటాయి. ఈ క్రమంలో ఈ ప్రమాదం జరగడం చాలా విషాదకరం.

# క్యూ కడుతున్న విదేశీయులు

మంది విదేశీయులు వైద్య చికిత్సల నిమిత్తం భారత్‌ను సందర్శించారని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ గురువారం నాడు పార్లమెంటుకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ ఏడాది దేశానికి వచ్చిన మొత్తం విదేశీ పర్యాటకుల్లో మెడికల్ టూరిస్టుల వాటా సుమారు 4.1 శాతంగా ఉందని మంత్రి వివరించారు. గత ఐదేళ్లుగా వైద్య పర్యాటకుల సంఖ్య స్థిరంగా పెరుగుతోందని తెలిపారు. 2020లో 1.8 లక్షలుగా ఉన్న ఈ సంఖ్య, 2024 నాటికి 6.4 లక్షలకు చేరిందని పేర్కొన్నారు. అయితే 2023లో వచ్చిన 6.5 లక్షల మందితో పోలిస్తే 2024లో స్వల్ప తగ్గుదల కనిపించింది. బంగ్లాదేశ్, ఇరాక్, సోమాలియా, ఒమాన్, ఉజ్బెకిస్థాన్ వంటి దేశాల నుంచి అత్యధికంగా వైద్యం కోసం భారత్‌కు వస్తున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.దేశంలో మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో 'హీల్ ఇన్ ఇండియా' అనే ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆసుపత్రులు, వాణిజ్య సంఘాలతో కలిసి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కృషి చేస్తోందని మంత్రి షెకావత్ తెలిపారు. విదేశీయులు సులభంగా వైద్యం కోసం రాగలిగేలా వీసా విధానాలను సరళీకరించినట్లు చెప్పారు. ప్రస్తుతం 171 దేశాల పౌరులకు ఈ-మెడికల్ వీసా, ఈ-మెడికల్ అటెండెంట్ వీసా సౌకర్యాన్ని అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం భారతదేశంలో మెడికల్ టూరిజం మార్కెట్ విలువ సుమారు 9 బిలియన్ డాలర్లుగా అంచనా వేస్తున్నారు. గ్లోబల్ మెడికల్ టూరిజం సూచీలో భారత్ 10వ స్థానంలో నిలిచింది. ముఖ్యంగా ఆయుష్ (ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి) వైద్య విధానాలకు ఆదరణ పెరగడంతో ఈ రంగం మరింత వృద్ధి చెందుతోంది. జూలై 2023 నుంచి డిసెంబర్ 2024 మధ్య కాలంలో 123 రెగ్యులర్ ఆయుష్ వీసాలు, 221 ఈ-ఆయుష్ వీసాలు జారీ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## సంపాదనతో కలగని సంతృప్తి సాయం చేస్తే వస్తుంది

ఓ ప్రైవేట్ హోటల్‌లో గురువారం 'పీపుల్స్ పార్ట్‌నర్‌షిప్ ఫర్ పావర్టీ ఎరాడికేషన్' (పీ4) కార్యక్రమంపై పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శకులుగా మారి పేద కుటుంబాల అభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో సంస్కరణలు చూశాను. కానీ పీ4 కార్యక్రమం ఇస్తున్న తృప్తి మరేదీ ఇవ్వడం లేదు. ఆర్థిక సంస్కరణల ఫలాలను కొందరు అందుకుని ఉన్నత స్థాయికి చేరారు, మరికొందరు వెనుకబడిపోయారు. ఇప్పుడు ఆ అసమానతలను తొలగించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ఉన్నత స్థితిలో ఉన్నవారు చేసే చిన్న సాయం కూడా, పేదరికంలో ఉన్నవారికి అతిపెద్ద భరోసా ఇస్తుంది," అని వివరించారు.

### ప్రభుత్వానిది సంక్షేమం, మీది బాధ్యతాయుత సాయం

మాటలతో కాకుండా చేతల్లో చేసి చూపించాలనే ఉద్దేశంతో తాను స్వయంగా 250 కుటుంబాలను దత్తత తీసుకున్నానని చంద్రబాబు తెలిపారు. "ప్రభుత్వం తరఫున పింఛన్లు, తల్లికి వందనం, దీపం పథకం, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ప్రభుత్వ సాయానికి తోడుగా మీరు కూడా బాధ్యత తీసుకుని దత్తత కుటుంబాల్లో నైపుణ్యాలను పెంచడం ద్వారా వారి ఆదాయం రెట్టింపు అయ్యేలా చూడాలి," అని ఆయన కోరారు.

### సీఎం పిలుపుకు భారీ స్పందన

చంద్రబాబు పిలుపునకు సమావేశంలో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు, ఎన్నారైల నుంచి విశేష స్పందన లభించింది. ప్రకాశం జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త మోహన్ రెడ్డి ఒకేసారి 729 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చారు. పలువురు ఎన్నారైలు, స్థానిక వ్యాపారవేత్తలు వందలాది కుటుంబాలను, పాఠశాలలను దత్తత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్థికంగా సాయం చేయలేని వారు తమ విజ్ఞానాన్ని, నైపుణ్యాలను పంచేందుకు వీలుగా 'కో-స్పాన్సర్' విధానాన్ని కూడా తీసుకువస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు, ఎన్నార్టీ ఛైర్మన్ వేమూరి రవి తదితరులు పాల్గొన్నారు.?

# రిజర్వేషన్ల పెంపుపై ఆశల్లేనట్లే

అడిగి తెలుసుకుంటామంటున్నారు.

### తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి

ఇప్పటికే స్థానిక సంస్థలకు కేంద్రం నుండి వచ్చే నిధులు ఆగిపోయాయాని రేవంత్ అన్నారు. జంతర్ మంతర్ లో చేసిన దీక్ష మా నిరసన దేశవ్యాప్తంగా తెలంగాణ బిసి రిజర్వేషన్ కోసం చేస్తున్న పోరాటం తెలియాలి అనే చేశామన్నారు. రాహుల్ గాంధీ శిబు సోరేన్ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్ళడం జరిగిందన్నారు. రాహుల్ గాంధీ రాలేదు అని ప్రతిపక్షాలు చేసే వ్యాఖ్యలు. తాను పట్టించుకోనని తేల్చేశారు. పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లడానికి ప్రభుత్వానికి ఎలాంటి ఆటంకాలు ఉండవు. కానీ పాత కోటాతోనే ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. దాని వల్ల విపక్షాలు ఎదురుదాడి చేయడానికి అవకాశం ఉంది.

# పుతిన్‌తో అజిత్ దోవల్ కీలక సమావేశం

సలహాదారు అజిత్ దోవల్, ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యారు. మాస్కోలోని క్రెమ్లిన్‌లో జరిగిన ఈ ఉన్నత స్థాయి భేటీ ఇరు దేశాల మధ్య బలమైన స్నేహ బంధానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సమావేశంలో ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. దోవల్‌తో పాటు రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు, అధ్యక్ష కార్యాలయం సహాయకుడు యూరి ఉషకోవ్ కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. ఇరు దేశాల మధ్య రక్షణ, వాణిజ్యం, ఇంధన రంగాల్లో సహకారాన్ని మరింత విస్తృతం చేయడంపై ఈ చర్చలు దృష్టి సారించినట్లు సమాచారం. ఈ పర్యటనలో భాగంగా అజిత్ దోవల్ రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగుతో విడిగా కూడా భేటీ అయ్యారు. ఈ భేటీలోనే రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటనకు సంబంధించిన సన్నాహకాలపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. త్వరలోనే వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన తేదీలను ఖరారు చేసే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ ఉన్నత స్థాయి పర్యటనలు ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు చేర్చగలవని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఈసీ చేతిలో ప్రజాస్వామ్యం ఖూనీ

ఉందా? సరైన వ్యక్తులు ఓటు వేయగలుగుతున్నారా? ప్రజల్లో తీవ్రమైన అనుమానాలు ఉన్నాయి, వాటికి బలమైన కారణాలు కూడా ఉన్నాయి" అని రాహుల్ అన్నారు. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల మధ్య కేవలం ఐదు నెలల వ్యవధిలో ఏకంగా కోటి మంది కొత్త ఓటర్లు ఎలా పెరిగారని ఆయన ప్రశ్నించారు. "లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మేము ఘన విజయం సాధించాం. కానీ కొన్ని నెలల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోయాం. ఈ మధ్యలో కోటి మంది కొత్త ఓటర్లు పుట్టుకొచ్చారు. దీనిపై వివరణ ఇవ్వాలని ఈసీని కోరినా వారి నుంచి సమాధానం లేదు" అని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, హర్యానా, మధ్యప్రదేశ్‌లలో ఒపీనియన్ పోల్స్‌కు, తమ అంతర్గత సర్వేలకు, వాస్తవ ఫలితాలకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని, ఫలితాలను ముందుగానే నిర్దేశించినట్లుగా ఉందని రాహుల్ ఆరోపించారు. మహారాష్ట్రలో పోలింగ్ కేంద్రాల వద్ద పెద్దగా క్యూలు లేనప్పటికీ, సాయంత్రం 5 గంటల తర్వాత పోలింగ్ శాతం అమాంతం పెరిగిపోవడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీశారు. విశ్లేషణ కోసం ఓటర్ల జాబితా సాఫ్ట్ కాపీలను ఈసీ ఉద్దేశపూర్వకంగా నిరాకరిస్తోందని, సీసీటీవీ ఫుటేజ్‌ను ధ్వంసం చేస్తోందని రాహుల్ ఆరోపించారు. "ప్రధాని మోదీ కేవలం 25 సీట్ల మెజారిటీతో ఉన్న ప్రధాని. ఆయన అధికారంలో కొనసాగాలంటే 25 సీట్లను దొంగిలిస్తే సరిపోతుంది. అందుకే ఎన్నికల సంఘం నిజాలను కప్పిపుచ్చుతోంది" అని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# హైదరాబాద్‌లో కుండపోత

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ లో ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఎక్కడికక్కడ వాహనాలు ఆగిన క్రమంలో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ, ఎల్బీనగర్, నాగోల్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్ మెట్ వంటి ప్రాంతాల్లో కుండపోత వర్షం పడింది. ఇక పంజాగుట్ట, ఐకియా, దిల్ సుఖ్ నగర్, మలక్ పేట్, అత్తాపూర్ ప్రాంతాల్లో వర్ష బీభత్సం కారణంగా ట్రాఫిక్ చాలా నెమ్మదిగా సాగింది. పాతబస్తీలోని సంతోష్ నగర్, చాంద్రాయణగుట్ట, సికింద్రాబాద్, కంటోన్మెంట్ లోని లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే తెలంగాణలోని హైదరాబాద్ లో "క్లౌడ్ బరస్ట్" ఏర్పడినట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. దీంతో మరో గంటలో 80 నుంచి 100 ఎంఎం ల భారీ వర్షంతో పాటు వరదలు నమోదు అవుతాయని పేర్కొన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన భీకర వర్షం నమోదు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆకస్మిక వర్షాలకు హైదరాబాద్ చుట్టుపక్కల చెరువులు పూర్తిగా నిండిపోయిన నేపథ్యంలో వరదలు వ్యాపించే ప్రమాదం ఉందని అంచనా వేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు సీఎస్, డీజీపీ, హైడ్రా కమిషనర్ కు సీఎం రేవంత్ రెడ్డి ఫోన్ చేశారు. భారీ వర్ష సూచనపై ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు సీఎం రేవంత్. విపత్తు నిర్వహణ బృందాలను సంసిద్ధంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 2 రోజులపాటు రాష్ట్రంలో విస్తారమైన వర్షాలు కురుస్తాయన్న సంకేతాల నేపథ్యంలో.. అన్ని శాఖల అధికారులతో పరిస్థితి సమీక్షించాలని జిల్లా కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ లో అర్ధరాత్రి వర్షాలు కారణంగా అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. హైదరాబాద్ లో ప్రజలు అత్యవసరం అయితేనే బయటకు రావాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇక హైదరాబాద్ సిటీలో పెనుగాలులతో కుండపోత వర్షం కురుస్తోంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, గచ్చిబౌలి, కొండాపూర్, మియాపూర్, హిమాయత్‌నగర్, లక్డీకపూల్, నాంపల్లి సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షం నమోదవుతోంది. పంజాగుట్ట, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్, మాదపూర్, కొండాపూర్, బయోడైవర్సిటీ, ఐకియా సెంటర్, ఏఎంబీ, ఇనార్బిల్ మాల్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, హైటెక్‌సిటీలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఉత్తరాఖండ్ లో ఆకస్మిక వరదలకు క్లౌడ్ బరస్ట్ కారణం కావడంతో హైదరాబాద్ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### అధికారుల సెలవులు రద్దు

అలాగే, రెవెన్యూ అధికారుల సెలవులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. నగరంలో వర్ష సంబంధిత సహాయం కోసం ప్రజలు సంప్రదించాల్సిన ముఖ్యమైన ఫోన్ నెంబర్ల వివరాలను అందించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయం కోసం: 8333068536, ఐసీసీసీకి ఫిర్యాదు చేయడానికి: 8712596106,హైడ్రా సహాయం కోసం: 9154170992, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల సహాయం కోసం : 8712660600 రాచకొండ ట్రాఫిక్ పోలీసుల సహాయం కోసం: 8500411111 , 8712662999.

# యువత వారానికి ఒక్కసారైనా చేనేత వస్త్రాలు ధరించాలి

నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో చేనేత రంగానికి లబ్ధి చేకూర్చేలా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఉచిత విద్యుత్ పథకంతో పాటు, చేనేత సొసైటీల నుంచి ఆప్కో కొనుగోలు చేసే వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ రాయితీ ఇవ్వాలని కూడా ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. దీనితో పాటు, కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు థ్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం చేనేత రంగానికి అన్ని విధాలుగా ఊతమిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. చేనేత వస్త్రాల వాడకాన్ని పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడతామని అన్నారు. రాష్ట్రంలోని యువత వారానికి ఒక్కరోజైనా చేనేత వస్త్రాలు ధరిస్తే, ఆ రంగంపై ఆధారపడిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అసంఘటిత రంగాలలో కీలకమైన చేనేతను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

## రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం తెలంగాణ ప్రజల్ని అవమానించడమే

మాట్లాడారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ దొరకకపోవడం తెలంగాణ ప్రజల్ని అవమానించడమేనన్నారు. బీజేపీ తెలంగాణ ప్రజలకు ఎప్పుడూ అన్యాయం చేస్తోందని, రిజర్వేషన్ల విషయంలో వితండవాదం చేస్తోందని విమర్శించారు. తెలంగాణలో నిర్వహించిన కులగణన సంపూర్ణమైన మరియు పారదర్శకమైన విధానంలో జరిగిందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. లోపభూయిష్టంగా జరిగిందన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. కులగణనలో 66.39 లక్షల గ్రామీణ ఇళ్లు, 45.15 లక్షల పట్టణ ఇళ్ల నుంచి డేటా సేకరించామన్నారు. ఈ గణన ఫలితాల ప్రకారం, బీసీలు ముస్లిం బీసీలు మినహా 46.2 శాతం, ముస్లిం బీసీలతో కలిపితే 56 శాతం జనాభాను కలిగి ఉన్నారని తేలిందన్నారు.ఈ డేటా ఆధారంగా 42 శాతం రిజర్వేషన్ల నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. జంతర్ మంతర్ ధర్నాకు రాహుల్ గాంధీ , మల్లికార్జున్ ఖర్గే హాజరు కాకపోవడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను రేవంత్ రెడ్డి ఖండించారు. రాహుల్ గాంధీ..ఇటీవలే తండ్రిని కోల్పోయిన హేమంత్ సోరెన్ ను పరామర్శించడానికి వెళ్లారని అన్నారు. కిషన్ రెడ్డి "గల్లీ లీడర్"లా మాట్లాడటం సరికాదని, కులగణన సర్వే గురించి ఆయనకు అనుమానాలు ఉంటే, డేట్, టైమ్, ప్లేస్ ఫిక్స్ చేస్తే అధికారులు ప్రెజెంటేషన్ ద్వారా వివరిస్తారని సవాల్ విసిరారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీఆర్ఎస్ శిఖండి పాత్ర పోషిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. జంతర్ మంతర్ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొనకపోవడమే కాక, అవహేళన చేస్తూ మాట్లాడారని మండిపడ్డారు.

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వేషన్లను 50 శాతంగా పరిమితం చేసిన చట్టాన్ని రూపొందించిందని, దాన్ని అధిగమించేందుకే తాము ఆర్డినెన్స్ తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో 100 మందికి పైగా ఎంపీలు, అలాగే డీఎంకే, ఎన్సీపీ, సమాజవాదీ పార్టీ, లెఫ్ట్ పార్టీలు వంటి ఇండియా కూటమి పార్టీలు మద్దతు ప్రకటించాయని రేవంత్ తెలిపారు. వారందరికీ ధన్యవాదాలుతెలిపారు. రాష్ట్రపతి ఆమోదం ఆలస్యమైతే, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ బిల్లులు ఆమోదం పొందకపోతే, బీజేపీ వెనుకబాటు తరగతులకు వ్యతిరేకమని నిరూపితమవుతుందని ఆయన హెచ్చరించారు. బీజేపీ నాయకుడు ఎన్. రామచందర్ రావు 42 శాతం ఓబీసీ రిజర్వేషన్‌ను సమర్థిస్తూనే, అందులో 10 శాతం ముస్లింలకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై రేవంత్ రెడ్డి స్పందిస్తూ, బీజేపీ ముస్లిం రిజర్వేషన్ల పేరుతో బీసీ కోటాను అడ్డుకుంటోందని ఆరోపించారు.

## దిగ్వాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ

జహీరాబాద్, : కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో ప్రజపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ జరిగింది. పేదవారికి సొంత ఇంటి కల నెరవేర్చడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని ఆత్మ కమిటీ చైర్మన్ పట్లోళ్ల రామలింగా రెడ్డి గురువారం అన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. భూమి పూజలో పాల్గొని పనులు ప్రారంభించారు.

## సంపాదనతో కలగని సంతృప్తి సాయం చేస్తే వస్తుంది

ఆయన గుర్తు చేశారు.

### అధికారులకు హెచ్చరిక..

పరిగి నియోజకవర్గంలో ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారిని ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము సామాజిక న్యాయం పాటిస్తామని కాంగ్రెస్ చెప్పే 42 శాతం కంటే ఎక్కువ సీట్లు బీసీలకు ఇస్తామని హామీ ఇచ్చారు. చేతిలో ఉన్న బీసీ సబ్ ప్లాన్ ను ఎందుకు అమలు చేయడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 2016-2023 మధ్య 6,47,479 రేషన్ కార్డులు పంపిణీ చేసినప్పటికీ కాంగ్రెస్ అధికారులు దీనిని దాచిపెట్టి గత ప్రభుత్వం ఏమీ చేయలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మరో మూడేళ్లలో బీఆర్ఎస్ మళ్ళీ అధికారంలోకి వస్తుందని అప్పుడు ఇలాంటి అధికారుల హిసాబ్ కితాబ్ సరిచేస్తామని కేటీఆర్ తీవ్రంగా హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలపై ఐఏఎస్, ఐపీఎస్ అసోసియేషన్లు అభ్యంతరం వ్యక్తం చేసి, ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి.

### పార్టీ విలీనంపై వివరణ..

బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం అవుతుందని జరుగుతున్న ప్రచారాన్ని కేటీఆర్ ఖండించారు. బీజేపీలోకి విలీనం కావాల్సిన అవసరం తమ పార్టీకి లేదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని కాంగ్రెస్, బీజేపీలకు తాము ధీటైన పోటీ ఇస్తామని చెప్పారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకువచ్చి, కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# బనకచర్లపై కేంద్రం సంచలన నిర్ణయం

పంపాలని కేంద్ర జలవనరుల శాఖ రెండు రాష్ట్రాలను కోరింది. అదనంగా, కేంద్రం తరపున మరో ఇద్దరు నిపుణులను ఈ కమిటీలో నియమించనుంది.గోదావరి నది వరద జలాలను రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు తరలించే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టును ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు ద్వారా 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు కొత్త ఆయకట్టు, 22 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా రూ.80,112 కోట్లతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు గోదావరి నదిలో తమకు కేటాయించిన 968 టీఎంసీల నీటి హక్కులను హరిస్తుందని అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టు 1980 గోదావరి జల వివాద ట్రిబ్యునల్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014ను ఉల్లంఘిస్తుందని తెలంగాణ ఆరోపిస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు కేంద్ర జలశక్తి శాఖ, గోదావరి బోర్డు, సీడబ్ల్యూసీకు లేఖలు రాశారు. జనవరి 22, 2025న రాసిన లేఖలో, ఏపీ డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సమర్పించకుండా నిలువరించాలని కోరారు. తర్వాత కేంద్రమంత్రి సమక్షంలో ఇరు రాష్ట్రాల సీఎంలు సమావేశమయ్యారు. ఆ సమావేశంలో నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బనకచర్ల వివాదాన్ని పరిశీలించడానికి, ఇరు రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాంకేతిక, ఆర్థిక అంశాలపై అధ్యయనం చేయడానికి కేంద్ర జలశక్తి శాఖ 12 మంది నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయనుంది. ఈ కమిటీలో ఏపీ, తెలంగాణ నుంచి సాంకేతిక నిపుణులు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు ఉంటారు. ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రీ-ఫీజిబిలిటీ రిపోర్ట్ (పీఎఫ్ఆర్)ను సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ)కు సమర్పించింది. ప్రాజెక్టు పనులు ఇంకా ప్రారంభం కాలేదని ఏపీ కేంద్రానికి తెలిపింది. తెలంగాణ అభ్యంతరాల కారణంగా కేంద్ర జలశక్తి శాఖ గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులతో సంప్రదించి, తెలంగాణ అభిప్రాయాలను సేకరించిన తర్వాత మాత్రమే సాంకేతిక, ఆర్థిక అంచనాలపై ముందుకెళ్తామని స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల కోసం ఏపీ ప్రభుత్వం టర్మ్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్)ను కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు చెందిన పర్వేష్ వెబ్‌సైట్‌లో నమోదు చేసింది. అయితే, ఎక్స్‌పర్ట్స్ అప్రైసల్ కమిటీ (ఈఏసీ) ఈ ప్రతిపాదనలను పరిశీలించి వెనక్కి పంపినట్లు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాజ్యసభలో తెలిపారు.

# చేనేతలకు చంద్రబాబు బంపర్ ఆఫర్

పెన్షన్లు ఇస్తామని వెల్లడించారు. జాతీయ చేనేత దినోత్సవం నేపథ్యంలో అక్కడికి వచ్చిన చేనేత కార్మికులతో సీఎం చంద్రబాబు నేరుగా మాట్లాడి వారి సమస్యలు, వాటి పరిష్కారానికి అనుసరించాల్సిన మార్గాలపై చర్చించారు.

ఈ నెల నుంచే చేనేత మగ్గాలు ఉన్నవారికి నెలకు 200 యూనిట్ల ఉచిత కరెంటును సరఫరా చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఒకవేళ పవర్ లూమ్ ఉన్నవారికి నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించారు. అంతేకాకుండా చేనేత కార్మికులకు జీఎస్టీలో 5 శాతాన్ని తిరిగి వెనక్కి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు నెల నెలా పెన్షన్లు అందిస్తామని చంద్రబాబు తెలిపారు. వీటన్నింటితోపాటు రాజధాని అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు.ఈ సందర్భంగా చేనేత వైభవానికి పుట్టినిల్లు తెలుగు నేల అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేనేత ఒక సంపద అని చంద్రబాబు కొనియాడారు. శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు ఖద్దరును మహాత్మాగాంధీ మెచ్చుకున్నారని గుర్తు చేశారు. హరప్పా కాలం నుంచి చేనేత అభివృద్ధి చెందుతూ వస్తోందని నాగరికతకు మూలం నేతన్నే అంటూ ప్రశంసలు కురిపించారు. కాకతీయులు పాలించిన కాలంలో నాణేలపైన చేనేతల ముద్రలు కనిపిస్తాయని పేర్కొన్నారు. వ్యాపారం కోసం భారత్‌కు వచ్చిన బ్రిటిష్ వారు మన దేశంలోని చేనేతలపై ప్రభావం చూపారని తెలిపారు. అందుకే స్వాతంత్ర్య పోరాటంలో విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని మన దేశంలో నేసిన బట్టలను మాత్రమే ఉపయోగించాలని గాంధీజీ చెప్పారని చెప్పారు.

తెలుగుదేశం పార్టీతో చేనేతలకు అవినాభావ సంబంధం ఉందన్న చంద్రబాబు వారికి మొట్టమొదట ఉపాధి కల్పించింది ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. 40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో చేనేతల కోసం రాజీ లేని పోరాటం చేసినట్లు చంద్రబాబు చెప్పారు.మన దేశంలో వ్యవసాయం తర్వాత అత్యధికంగా ఉపాధి కల్పించే రంగం వస్త్ర పరిశ్రమ అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 55,500 మంది చేనేత కార్మికులకు ఒక్కొక్కరికీ రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.27 కోట్ల రుణాలు ఇచ్చినట్లు చంద్రబాబు వెల్లడించారు.

మొత్తం 90,765 కుటుంబాలకు 100 యూనిట్లు ఉచిత కరెంటును సరఫరా చేసినట్లు తెలిపారు. చేనేత కార్మికులు చిన్న వయసులోనే అనారోగ్యం పాలవుతుండటంతో వారికి 50 ఏళ్లకే పింఛన్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. 50 శాతం సబ్సిడీతో మర మగ్గాలు ఇచ్చేందుకు రూ.80 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.

# మైనార్టీ బాలికల వసతి గృహంలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

నారాయణఖేడ్, : నారాయణఖేడ్ పట్టణంలోని తెలంగాణ మైనార్టీ బాలికల పాఠశాల మరియు కళాశాల వసతి గృహాన్ని గురువారం సబ్ కలెక్టర్ ఎన్. ఉమా హారతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతులు, వంటశాల, రికార్డులను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

## మెదక్ జిల్లాలో కారు బోల్తా..

# ఇద్దరు దుర్మరణం

మెదక్, : మెదక్ జిల్లాలో శివంపేట మండలం చాకరిమెట్ల దేవాలయం వద్ద వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో లింగాపూర్ గ్రామానికి చెందిన డ్రైవర్ ఉప్పలకు ఆంజనేయులు, శివంపేటకు చెందిన కొడకంచి బాలమణి అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు మృతదేహాలను నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## కొల్లాపూర్‌లో బీసీ రిజర్వేషన్

# పితామహుడు మండల్ దినోత్సవం

నాగర్‌కర్నూల్, : కొల్లాపూర్ నియోజకవర్గంలో బీసీ రిజర్వేషన్ల పితామహుడు బి.పి. మండల్ ప్రవేశపెట్టిన మండల్ కమిషన్ నివేదికలోని 27% బీసీ రిజర్వేషన్లను కేంద్రం పూర్తిస్థాయిలో అమలు చేయాలని తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు అప్పల మాసయ్య యాదవ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని, తెలంగాణలో 42% రిజర్వేషన్లను ఆమోదించాలని ఆయన కోరారు. 1990 ఆగస్టు 7న పార్లమెంట్ ఈ సిఫార్సులను ఆమోదించింది.

# వరలక్ష్మీ వ్రతం ఆచరించడంతో

# అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి

నమస్తేస్తు మహామాయే శ్రీ పీఠే సుర పూజితే!
శంఖచక్ర గదా హస్తే మహాలక్ష్మీ నమోస్తుతే !!

"మహామాయారూపిణి, శ్రీపీఠవాసిని, దేవతలు నిరంతరం సేవించే లోకమాత, శంఖ, చక్ర, గదల్ని ధరించిన మహాలక్ష్మీ దేవి అష్టైశ్వర ప్రదాయిని. అష్ట సంపదల్ని అందించే జగన్మంగళదాయిని. అష్టైశ్వరాల్నీ కలగజేసే అష్టలక్ష్మి రూపాన్నే వరలక్ష్మీ దేవిగా మనం ఆరాధిస్తాం. భక్తితో పూజించినవారికీ, కొలిచినవారికీ కొంగుబంగారమై వరాలనిచ్చే మహాలక్ష్మే వరలక్ష్మి" హిందు సంప్రదాయంలో శ్రావణమాసానికి ఆధ్యాత్మిక మాసంగా ప్రత్యేకతను సంతరించుకుంది. పౌర్ణమి రోజున చంద్రుడు శ్రవణం నక్షత్రంతో కలిసిన రోజు కాగా శ్రీ మహావిష్ణువు జన్మ నక్షత్రం కూడా శ్రవణా నక్షత్రం కావడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఇంతటి పవిత్రమైన ఈ నెలలో వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించడం వలన విశేషమైన ఫలితాలు సిద్దిస్తాయని భక్తుల నమ్మకం. లక్ష్మీదేవి సంపద, ఐశ్వర్యం, శ్రేయస్సు, అదృష్టానికి దేవత. వరలక్ష్మీ వ్రతం చేయడం ద్వారా లక్ష్మీదేవి అనుగ్రహం పొంది, ఇంట్లో సుఖశాంతులు నెలకొంటాయని భక్తుల ప్రగాడ విశ్వాసం. శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు వరాలిచ్చే కల్పవల్లీ, భక్తుల పాలిట కల్పతరువైన వరలక్ష్మీదేవి వ్రతాన్ని భక్తి శ్రద్దలతో ఆచరిస్తే అష్టైశ్వర్యాలు సిద్దిస్తాయని భక్తుల విశ్వాసం. హిందు సంప్రదాయం ప్రకారం ఈ పండగ ఎంతో విశిష్టమైనది. ఈ రోజున వరలక్ష్మీదేవిని పూజిస్తే అష్టలక్ష్మీ పూజలకు సమానం అని భక్తుల విశ్వాసం. ముఖ్యంగా సుగుణాలుగల భర్త, ప్రయోజకులైన కుమారులు కలగాలని పెళ్ళికాని అమ్మాయిలు పూజిస్తే, భర్త ఆయుస్సు, శ్రేయస్సు, సిరిసంపదలు, సుఖశాంతులు సిద్ధించాలని పెళ్ళైన మహిళలు వరలక్ష్మీ వ్రతాని ఆచరించడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. వరలక్ష్మీదేవిని మనసార పూజిస్తే అష్టైశ్వర్యాలైన సంపద, భూమి, విద్య, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి లభిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

### పురాణ గాథ

స్కాంద పురాణంలో పరమేశ్వరుడు వరలక్ష్మీదేవి వ్రతం ఇతివృత్తాన్ని పార్వతీదేవికి వివరించిన ప్రకారం లోకంలో స్త్రీలు సకల ఐశ్వర్యాలను, పుత్ర పౌత్రాదులను పొందేందుకు వీలుగా ఏదైనా ఓ వ్రతాన్ని సూచించమని పార్వతీదేవి ఆదిదేవుడిన్ని కోరగా, అప్పుడు పార్వతి దేవికి పరమశివుడు వరలక్ష్మీదేవి వ్రత మహాత్మ్యాన్ని వివరిస్తు, అదే సందర్భంలో పరమ శివుడు ఆమెకు చారుమతీదేవి వృత్తాంతాన్ని తెలియజేశాడని పురాణాల సారాంశం. చారుమతిదేవి భర్త పట్ల ఆదరణ, అత్తమామల పట్ల గౌరవాన్ని ప్రదర్శిస్తు ఉత్తమ ఇల్లాలుగా తన బాధ్యతల్ని నిర్వహిస్తు మహాలక్ష్మీదేవి పట్ల భక్తిశ్రద్ధలతో త్రికరణ శుద్ధిగా పూజిస్తుండేది. ఆ మహా పతివ్రతకు వరలక్ష్మీదేవి అనుగ్రహం కలిగి, స్వప్నంలో సాక్షాత్కరించి శ్రావణ శుక్ల పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారాన తనను ఆరాధిస్తే కోరిన వరాలన్నీ ఇస్తానని దేవదేవి చారుమతిదేవికి అభయమిస్తుంది. అమ్మ ఆదేశానుసారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించిన చారుమతి సమస్త సిరి సంపదల్ని అందుకుందని పరమేశ్వరుడు, పార్వతి దేవికి విశదపరచాడని పురాణ కథనం. దీంతో పార్వతీ దేవి కూడా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి, వరలక్ష్మి కృపకు పాత్రురాలైందని చెబుతారు.

### వ్రత మహాత్యం

అష్టలక్ష్మీ దేవతల్లో వరలక్ష్మీ దేవికి ఓ ప్రత్యేకత ఉంది. మిగిలిన లక్ష్మీ పూజలకంటే వరలక్ష్మీ పూజ ఎంతో శ్రేష్ఠమని శాస్త్ర వచనం. శ్రీహరికి ఇష్టమైన, పైగా విష్ణువు జన్మనక్షత్రమైన శ్రవణం పేరిట వచ్చే శ్రావణ మాసంలో ఈ వ్రతాన్ని ఆచరిస్తే విశేష ఫలితాలు సిద్ధిస్తాయి. సర్వమంగళ సంప్రాప్తి కోసం,సకలాభీష్టాల కోసం,నిత్య సుమంగళిగా తాము వర్ధిల్లాలని పుణ్య స్త్రీలు వరలక్ష్మీదేవి వ్రతాన్ని శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా ఆచరిస్తారు. ఏ పద్ధతిలో పూజించినను శ్రీ వరలక్ష్మీదేవి కటాక్షం సిద్ధిస్తుంది. సకల శుభంకరమైన, నమ్మంగళదాయకమైన వరలక్ష్మీదేవి పూజ జగదానందకరమైనదని భక్తులందరి ప్రగాఢ విశ్వాసం.



### వరలక్ష్మీ వ్రతం చేయడంతో అనుకూలతలు

శ్రావణమాసంలో వచ్చే పూర్ణిమకు (పున్నమి) ముందు శుక్రవారం నాడు ఆచరించే వరలక్ష్మీవ్రతం కొన్ని నియమ నిబంధనలు, ఆచార వ్యవహారాలకు లోబడి చేసే విశిష్ట వ్రతం. ప్రకృతిలో వచ్చే చెడు మార్పులను అనుకూలంగా మార్చుకోవడానికి చేసేదే శ్రీవరలక్ష్మీ వ్రతం. ఈ వరలక్ష్మీ వ్రతం ఆచరించే స్త్రీలు ఎంతో ఆనందోత్సాహాలతో వరలక్ష్మీ పూజకు కావలసిన అన్ని రకాల ఏర్పాట్లు ఘనంగా చేసుకోవడం విశేషం. భారతీయ జీవన విధానం ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకుని ఉంది. కాలానుగుణంగా ప్రకృతిలో వచ్చే పెనుమార్పులకు అనుగుణంగా ప్రత్యేక వ్రతాలు పూజలను ఏర్పాటు చేసారు. నియమ నిష్ఠలతో ఉంటు అందరితో కలిసి ప్రశాంతంగా ఉండాలనేదే వీటి ఉద్దేశం. కాగా ఎవరి స్థాయికి తగిన విధంగా ఈ వ్రతాన్ని ఆచరించుకుంటారు

### ఏకాగ్రత్తతతో అమ్మపై మనస్సును లగ్నం చేయాలి.

శ్రీవరలక్ష్మీ వ్రతం ఆచరించే సమయంలో నిశ్చలమైన ఏకాగ్రతతో మనస్సును లక్ష్మీదేవిపై లగ్గంచేసి భక్తి శ్రద్దలతో పూజించాలి. విగ్రహానికి పూజ చేస్తున్నాము అనే భావనలో కాకుండా అమ్మవారే తమ ఇంటికి వచ్చి అలా కూర్చుని షోడషోపచారాలతో పూజ చేయించుకుంటుందనే భావనతో పూజించాలి.

ఈ పూజలు చేసే స్త్రీలందరు తమను తాము వరలక్ష్మిగా భావించుకొని శ్రద్ధగా భక్తితో పూజించాలి. పూజా సమయంలో సుగంధ ద్రవ్యాలు, అగరబత్తులు, హారతి కర్పూరం, ధూపాన్ని వెలిగించాలి. ధూపం ఇవన్ని ఇంటిని, ఇంట్లో వాతావరణాన్ని అనుకూలంగా ప్రశాంతంగా మార్చడమే కాక ఇల్లు ఒక దేవాలయంగా మారుతుంది. ఇలాంటి సమయంలో వచ్చే ఆలోచనలు అన్నీ అనుకూలంగా ఉండడమే కాక సిరిసంపదలు సిద్దిస్తాయి.



వరలక్ష్మీ వ్రతం
శుభాభినందనలతో
రవికుమార్ సంతోజు
బడంగ్ పేట్. రంగారెడ్డి. జిల్లా

## మంచిర్యాలలో భారీగా ట్రాఫిక్ జాం




మంచిర్యాల, ఆ: మంచిర్యాల పట్టణంలో ఏసీసీ గేటు ముందు పెద్ద బరి చెట్టు పడటంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీనితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జేజదీ సహాయంతో చెట్టును తొలగించి, రహదారిని క్లియర్ చేయించారు. దీంతో ట్రాఫిక్ క్రమంగా పునరుద్ధరించబడింది. ఈ సంఘటనతో కొద్దిసేపు పట్టణంలో గందరగోళం నెలకొంది.

## రేషన్ కార్డుల పంపిణీలో ఉద్రిక్తత

ఆసిఫాబాద్, : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో గందరగోళం నెలకొంది. ఎమ్మెల్యే కోవలక్ష్మీ ప్రసంగాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గ ఇన్చార్జి శ్యాం నాయక్ లతో ఆమె వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ నాయకుల తీరుపై ఎమ్మెల్యే కోవలక్ష్మీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

## కాంగ్రెస్ వైఫల్యంపై బీఆర్ఎస్ ఆగ్రహం

మానకొండూరు, : గన్నేరువరంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై గురువారం నిరసన తెలిపారు. తెలంగాణలో రైతులకు సరిపడా ఎరువులు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, మోసపూరిత వాగ్దానాలతో రైతులను నాశనం చేసిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని చెరువులు, కాలువలు నీరులేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏవో కిరణ్మయి మాట్లాడుతూ రామగుండం ఎరువుల కర్మాగారంలో సాంకేతిక లోపం వల్ల కొరత ఏర్పడిందని, ప్రస్తుతం ఆ సమస్య లేదని, రవాణా జరుగుతుందని రైతులకు భరోసా ఇచ్చారు.

## 30 తులాల బంగారం మాయం

చొప్పదండి, : కరీంనగర్ సూర్యనగర్, వివేకానందపురి కాలనీల్లోని అపార్ట్మెంట్లలో దొంగతనాలు కలకలం సృష్టించాయి. భార్గవి ఎన్ క్లేవ్ లోని 301 ఫ్లాట్ తాళం పగలగొట్టి 30 తులాల బంగారం దొంగిలించబడింది. వెంకటేశ్వర రెసిడెన్సీలోని రెండు ఫ్లాట్లలోకి చొరబడిన దొంగలు, ఏమీ దొరక్కపోవడంతో వెనుదిరిగారు. పోలీసులు ఈ ఘటనలపై విచారణ చేపడుతున్నారు.

## ఓపెన్ యూనివర్సిటీ..

### డిగ్రీ, పీజీ ప్రవేశాలకు 13 లోగా దరఖాస్తు




కోరుట్ల, : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశాల కోసం ఈ నెల 13వ తేదీ లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వెంకయ్య తెలిపారు. మెట్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం యూనివర్సిటీ ప్రవేశాలకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దేవన్న, కో ఆర్డినేటర్ జిల్లా రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

### 16 మంది పదో తరగతి టాపర్లకు

## గంగిశెట్టి ట్రస్ట్ పురస్కారాలు

హుజూరాబాద్, : కరీంనగర్ జిల్లా హుజరాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్, కాటారం మండలంలో 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన 16 మంది స్కూల్ టాపర్లకు ప్రతిభా పురస్కారాలను అందజేసింది. ఈ అవార్డులను మండల విద్యాధికారి శ్రీదేవి సమక్షంలో ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ అందించారు. మెమొంటో, డిక్షనరీతో పాటు విద్యార్థులకు ఉన్నత చదువులు చదివి స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, రిటైర్డ్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సురేష్ బాబు పాల్గొన్నారు.

## 14లోగా డిమాండ్ల పరిష్కారం..

పెద్దపల్లి, : పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద గురువారం మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించి, తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారినా తమ డిమాండ్లను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 14లోగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే సమ్మె చేయనున్నట్లు హెచ్చరించారు.

## పాఠశాలలో రాఖీ కట్టించుకున్న విద్యార్థులు

ధర్మపురి, : జగిత్యాల జిల్లా, మెట్ పల్లి మండలం, జగ్గాసాగర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ముందస్తు రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు 'నీవు నాకు రక్ష, నేను నీకు రక్ష, మనమిద్దరం ఈ దేశానికి రక్ష' అంటూ ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కొమ్ముల రాజు పాల్ రెడ్డి మాట్లాడుతూ, సనాతన ధర్మ భాగమైన రక్షాబంధన్ ద్వారా విద్యార్థులలో బాల్యం నుండే సోదరభావం, దేశభక్తి పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం కోరుట్ల ప్రాంతంలో జరిగింది.

## సైబర్ నేరగాళ్ల మాయ

ఖమ్మం, : ఖమ్మం యూపీహెచ్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఈ. పుల్లయ్య సైబర్ నేరగాళ్ల చేతిలో రూ. 99,820 మోసపోయారు. బ్యాంకు బ్యాలెన్స్ చెక్ చేయమని వచ్చిన మెసేజ్ లింక్ పై క్లిక్ చేయడంతో ఈ సంఘటన జరిగింది. పుల్లయ్య గురువారం ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పొన్నెకల్లు బుగ్గవాగు ఉప్పొంగింది

### రెండు జిల్లాల రాకపోకలు స్తంభించాయి

కొత్తగూడెం, : కామేపల్లి మండలం పొన్నెకల్లు వద్ద బుగ్గవాగు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాల కారణంగా గురువారం ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీనితో కొత్తలింగాల - డోర్నకల్ ప్రధాన రహదారిపై వరద నీరు చేరడంతో ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణాలు కొనసాగుతున్నాయి.

## వర్షపు నీటితో చెరువులా దర్శనం

భద్రాచలం, : సుజాతనగర్ మండలం నిమ్మలగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణ వర్షపు నీటితో చెరువును తలపిస్తోంది. రోడ్డు కంటే తక్కువ ఎత్తులో ఉండటంతో స్వల్ప వర్షానికే నీరు నిలిచిపోతోంది. గురువారం విద్యార్థులు పాఠశాలలోకి వెళ్ళడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమస్య పరిష్కారానికి అధికారులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు.

### మధిర కోర్టు భవన నిర్మాణానికి

## శంకుస్థాపన

మధిర, : మధిర పట్టణంలో రూ. 24 కోట్లతో నిర్మిస్తున్న కొత్త కోర్టు భవన నిర్మాణానికి రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం అధ్యక్షులు, ఖమ్మం జిల్లా జడ్జి జి. రాజగోపాల్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ నూతన భవనం ద్వారా ప్రజలకు త్వరితగతిన న్యాయం అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎన్ ప్రశాంతి, జడ్జి వేముల దీప్తి, టౌన్ సీఐ రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు భోజెడ్ల పుల్లారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

### మద్యం మత్తులో

## వాహనాలపై దాడి

వరంగల్ ఈస్ట్, : వరంగల్ జిల్లా ఉప్పరపల్లి క్రాస్ రోడ్డులోని గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద రాత్రి మద్యం మత్తులో ఉన్న బిహార్ కు చెందిన కార్మికుడు జాతీయ రహదారిపై వాహనదారులపై, గ్రామస్థులపై కత్తులు, బండరాళ్లతో దాడి చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## సమాచార హక్కు చట్టంపై జనగామ కలెక్టరేట్ లో అవగాహన సదస్సు

జనగామ, : జనగామ కలెక్టరేట్ లో గురువారం కలెక్టర్ రిజ్వాన్ భాషా శాఖ అధ్యక్షతన సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, మోహిసిన పర్వీన్, బురెడ్డి అయోధ్య రెడ్డి, వైష్ణవి మేర్ల తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమాచార హక్కు చట్టం అమలుపై అవగాహన కల్పించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం.

### ఆరోగ్య అడిషనల్ డైరెక్టర్

## ములుగు హాస్పిటల్ ఆకస్మిక తనిఖీ

ములుగు,: ములుగు ఏరియా హాస్పిటల్ ను రాష్ట్ర హెల్త్ అడిషనల్ డైరెక్టర్ అమర్నాథ్ సింగ్ నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వివరాలు తెలుసుకొని, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలపై ఆరా తీశారు. రోగులకు సరైన వైద్యం అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఈ జ్వరాల పరీక్షల్లో నిర్లక్ష్యం వహించవద్దని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రాజీవ్ చౌరస్తాలో కుక్కల స్వైర విహారం


పాలకుర్తి, : జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో కుక్కలు ఒక్కసారిగా గుంపులు గుంపులుగా రావడంతో. ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు, స్కూలు విద్యార్థులు, గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.


## మహిళా సంఘాలకు అక్షరాస్యత శిక్షణ ప్రారంభం

సంగారెడ్డి, : ప్రభుత్వం 'ఉల్లాస్' కార్యక్రమం ద్వారా మహిళా సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించింది. డీఈవో వెంకటేశ్వర్లు గ్రామాల్లోని మహిళా సంఘాలకు అక్షరాలు నేర్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమం మహిళా సాధికారతకు దోహదపడుతుందని భావిస్తున్నారు.

# మున్సిపల్ శాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలం

- మరింత అవినీతి అక్రమాలలో జిహెచ్ఎంసి
- జిహెచ్ఎంసి ఇంటి పన్నులో రాబందువులు
- ప్రభుత్వ ఆదాయాన్ని మింగుతున్న ఈ ముగ్గురు అవినీతి అధికారులు
- రోజురోజుకీ అవినీతిలో కూర్కపోతున్న జిహెచ్ఎంసి
- జిహెచ్ఎంసి అధికారులు అవినీతిపై ఏసీబీ దాడులు పదేపదే జరగాల్సిందే
- ప్రభుత్వ అధికారుల్లో పెద్ద అవినీతి మార్పుకు ఇదే నిదర్శనం
- ప్రభుత్వ అధికారులపై దృష్టి సాధించవలసిన విజిలెన్స్, ఏసీబీ అధికారులు నిద్రమత్తులో తూగుతున్నారా.?
- అధికారులపై చర్యలు లేకపోవడంతో విచ్చలవిడిగా అక్రమాలకు, అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ అధికారులు
- జిహెచ్ఎంసిలో ప్రతి విభాగంలో అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులు ఎన్ని
- అనుమతులు ఇచ్చిన దరఖాస్తులు ఎన్ని అధికారుల పనితీరు తెలుస్తుంది
- అధికారుల అవినీతితో జిహెచ్ఎంసి ఆదాయం భారీగా తగ్గుముఖం
- జిహెచ్ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్లు పూర్తిగా విఫలం. వీళ్లకు జీతాలు దండగ అంటున్న ప్రజలు











హైదరాబాద్(ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ మహా నరక పాలక సంస్థ లో అవినీతి అక్రమాలు 1000 శాతం పెరిగిపోయాయి.



Property Details
PTIN :
1031104981
Owner Name :
ATTULURI CHAITANYA KIRAN
Owner Father Name :
.VENKATA RAO
Door No :
11-7-249
Address :
11-7-249
Pincode :
Mobile No :
******9924
Plinth Area(in Sqft) :
11064
Circle :
5-Saroornagar
Locality :
SAROOR NAGAR
Sub Register Office :
Register Doc No :
3324/2010
Registration Date :
19-08-2010 00:00:00
Assessment Type :
Building Usage :
RES
Annual Tax :
36908

ప్రతి విభాగంలో అవినీతి అక్రమాలకు కొదవ లేకుండా పోయింది ప్రతిరోజు జిహెచ్ఎంసి కి రావలసిన కోట్ల ఆదాయం సిబ్బంది అధికారుల జేబుల్లోకి వెళుతుంది అనడంలో అతిశయోక్తి లేదు. దీన్ని కట్టడి చేయడంలో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలం చెందింది. ఏసి కార్యాలయం ఏసీ కార్ లక్షలలో జీతాలు తీసుకుంటున్న జోనల్ కమిషనర్లు అసలు విధులు నిర్వహించకుండా కాలక్షేపానికి కార్యాలయానికి వచ్చి వెళుతున్నారు తప్ప అవినీతి అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులను కూడా పట్టించుకోకపోవడంతో జిహెచ్ఎంసి ల అవినీతి రాజ్యమేలుతుంది. ఇందుకు కారణం జోనల్ కమిషనర్లు పూర్తిగా విఫలం చెందారు వీళ్లకు ఇస్తున్న ప్రభుత్వ అలవెన్స్ లు జీతాలు దండగ అని ప్రజలు పహాటంగా విమర్శిస్తున్నారు. వెస్ట్ జోన్ లో సర్కిల్ నెంబర్ 5 లో జిహెచ్ఎంసి ఆదాయాన్ని రాబందుల్లా కబళిస్తున్న ఈ ముగ్గురు అధికారులే డిప్యూటీ కమిషనర్ ఏ సుజాత శ్రీధర్, శ్రీనివాస్, ఆనంద్ లను పట్టించుకోని ఉన్నతాధికారులు దృష్టి సాధించకుంటే ప్రభుత్వానికి భారీ నష్టం జరుగుతుందని వివరాల్లోకి వెళితే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈస్ట్ జోన్ సర్కిల్ నెంబర్. 5 లో ఉన్నటువంటి



డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసు, టాక్స్ ఇన్స్పెక్టర్ టి ఆనంద్ ఈ ముగ్గురు కలిసి డిప్యూటీ కమిషనర్ సుజాత శ్రీధర్ వచ్చినప్పటి నుంచి కమర్షియల్ టాక్స్ వెయ్యవలసిన కమర్షియల్ భవనాలకు రెసిడెన్షియల్ టాక్స్ వేసి అదే టాక్స్ కొనసాగిస్తూ కమర్షియల్ టాక్స్ వెయ్యకుండా ప్రభుత్వానికి రావలసిన డబ్బులు ప్రతినెల ఈ ముగ్గురు అధికారులకు మామూళ్ల రూపంలో వసూలు చేస్తున్నారని స్థానిక బిల్ కలెక్టర్ మీడియాకు తెలిపారు. కమర్షియల్ భవనం అయినటువంటి పి టి ఐ నెంబర్.1031104981, ఇంటి నె%శ్రీ%. 11-7-249 కమర్షియల్ భవనంలో ఏ బి సి అండ్ లూమ్స్ అనే కంపెనీ వ్యాపారం జరుగుతుందని అలాంటి భవనం 11064 ఎస్ ఎఫ్ టి ఉన్నటువంటి భవనము గతంలో ఉన్నటువంటి టాక్స్ రూ. 36908 సంవత్సరానికి ఉండగా ప్రస్తుత రేట్ల ప్రకారం రివైజుడు చేసినట్లయితే సుమారు రూ. 3 లక్షల 90 వేల రూపాయలు సంవత్సరానికి ఆదాయం ప్రభుత్వానికి కట్టవలసి ఉంటుందని, మరొక భవనం పి టి ఐ నెం.1031118651, ఇంటి నంబర్. 11-8-99/39/3/(8) ఈ భవనంలో సాఫ్ట్వేర్ అనే కంపెనీ కమర్షియల్ గా ఉపయోగిస్తున్నారని దీని ఎస్ ఎఫ్ టి 2087 ఉండగా గతంలో వేసిన టాక్స్ రూ. 2300 కడుతున్నారని ప్రస్తుతం రివైజ్ రేట్ల ప్రకారం సుమారు రూ. 1 లక్ష 90 వేల రూపాయలు ప్రభుత్వానికి కట్టవలసి ఉండగా అలా కట్టకుండా 2300 వందల రూపాయలు కట్టుకొని మిగతా డబ్బులను ఈ ముగ్గురు

అధికారులు ప్రతినెల మామూలు వచ్చే విధంగా




అందులో ముగ్గురు వాటాలు పంచుకుంటున్నారని, సర్కిల్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ సుజాత శ్రీధర్ వచ్చినప్పటి నుంచి ఇలాంటి అక్రమాలు ఎన్నో జరుగుతున్నాయని దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సాధించాలని ఆయన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు రావలసిన భారీ ఆదాయాన్ని ఇలాంటి అధికారులతో భారీగా నష్టం వాటిల్లుతుందని ఇలా చేయడం సరి కాదని నిలదీసినందుకు నాకు ఇచ్చినటువంటి డాకిట్లో ఇలా చేయడం సరికాదాన్ని నిలదీసినందుకు గత రెండు సంవత్సరాల నుండి మూడు నుంచి నాలుగు డాకిట్లు ఇచ్చి మార్పు చేసి నన్ను వివిధ రకాలుగా ఇబ్బంది పెడుతున్నారని స్థానిక బిల్ కలెక్టర్ తెలిపారు. బిల్ కలెక్టర్ నా పరిధిలో ఉన్నటువంటి కమర్షియల్ భవనాలకు గతంలో వేసిన టాక్స్ కంటే ప్రస్తుతం వేయవలసిన ట్యాక్స్ నోటీసులు ఇచ్చుటకు నోటీసు బుక్కు నాకు ఇవ్వకుండా నన్ను ఇబ్బందుల గురి చేస్తూరని, టాక్స్ పెంచవలసిన భవనాల వద్దకు వెళ్లి భవన యజమానులను సంప్రదించగా వెంటనే సంబంధిత డిప్యూటీ కమిషనర్



Property Details
PTIN :
1031118651
Owner Name :
Occupier
Owner Father Name :
Door No :
11-8-99/39/3 (8)
Address :
11-8-99/39/3 (8)
Pincode :
Mobile No :
******5505
Plinth Area(in Sqft) :
818.06
Circle :
5-Saroornagar
Locality :
SAROOR NAGAR
Sub Register Office :
-
Register Doc No :
Registration Date :
Assessment Type :
-
Building Usage :
RES
Annual Tax :
2300
Back




ఆధీనంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లు ఇతర అధికారులు ఫోన్ చేసి అక్కడికి వెళ్ళరాదని నువ్వు డిప్యూటీ కమీషనర్ మేడంకు వచ్చి కలవమని చెప్పి నాకు సంబంధించిన పనులను చేయకుండా చేస్తున్నారని ఇలా అయితే నా ఉద్యోగానికి ప్రమాదం వాటిల్లుతుందని ఎన్నోసార్లు నిలదీసిన నన్ను ఇబ్బందులకు గురిచేస్తున్నారు తప్ప ప్రభుత్వానికి వాళ్ళు చేసే నష్టాన్ని నేను సహించలేక నిలదీస్తే గత రెండు సంవత్సరాలుగా నన్ను వివిధ రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆ ఇబ్బందుల వలన నేను మానసికంగా ఇబ్బందులకు గురి అవుతున్నాన్ని ఆరోగ్యపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఇలాంటి పరిస్థితులలో ఆరోగ్యం కోసం డాక్టర్ ను కలవడంతో నీకు బీపీ, షుగర్ ఎక్కువగా ఉందని తగు జాగ్రత్తలు తీసుకోకపోతే నీ ప్రాణానికి ప్రమాదం ఉందని తెలపడంతో ఇలా అయితే నేను పని చేయలేదని వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవడం తప్పదని జిహెచ్ఎంసి కమిషనర్ ని కలవడం జరిగిందని ఆయన మీడియా ముఖంగా తెలిపారు. ఈ అవినీతి అధికారులపై చర్యలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చర్యలు తీసుకుంటారా లేదా గాలికి వదిలేసారా వేచి చూడాల్సిన అవసరం ఉందన్నారు.

## రాఖీ, వరలక్ష్మి వ్రతాలకు 400 ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్, : రాఖీ పౌర్ణమి, వరలక్ష్మి వ్రతం సందర్భంగా మహబూబ్ నగర్ రీజినల్ మేనేజర్ పి. సంతోష్ కుమార్ తెలిపారు. గురువారం నుంచి శనివారం వరకు హైదరాబాద్ నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లాలలోని వివిధ ప్రాంతాలకు 245 అదనపు ట్రిప్పులు, ఈ నెల 9 నుంచి 11 వరకు హైదరాబాద్ కు వెళ్లేందుకు 155 అదనపు ట్రిప్పులు నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## అర్వపల్లిలో ట్రంప్, మోడీ దిష్టిబొమ్మల దహనం

సూర్యాపేట, : వ్యవసాయ రంగంలో బహుళ జాతి కంపెనీల వైదొలగాలని, భారతదేశ ఎగుమతులపై 25% సుంకం, 50% పెంపును నిరసిస్తూ, మద్దతు ధర చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అర్వపల్లిలో ట్రంప్, మోడీ దిష్టిబొమ్మలను గురువారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు, పూలే అంబేద్కర్ ఆశయ పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ గుర్తింపునకు మోడీ కృషి

నల్లగొండ, : చేనేత పరిశ్రమకు జాతీయ గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రధాని మోడీ చేనేత జాతీయ దినోత్సవాన్ని ప్రకటించారని బిజెపి సీనియర్ నాయకుడు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని, చేనేత వస్త్రాలకు దేశీయంగానే కాకుండా విదేశీ మహిళల్లో కూడా ఆదరణ పెరుగుతోందని ఆయన అన్నారు.

## ఐపూర్ ఏటిలో మహిళ మృతదేహం..

కోదాడ, : ఆత్మకూర్ మండలం ఐపూర్ గ్రామ శివారులో ఏటిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం కావడంతో స్థానికంగా కలకలం రేగింది. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా, ఇది హత్యనా లేక ఇతర కారణాలా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు పూర్తి వివరాలు తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు

### 47 మందికి రూ. 21.4 లక్షల

## చెక్కులు అందజేత

నల్లగొండ, : తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నల్గొండలో గురువారం ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద 47 మంది నిరుపేదలకు రూ. 21.4 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ఈ ఆర్థిక సహాయం అందింది. ఈ పథకం లక్షలాది మంది పేదలకు అండగా నిలుస్తుందని ఆయన తెలిపారు.

## చిరుత సంచారం కలకలం

నిజామాబాద్ : నిజామాబాద్ నగరంలోని నాగారం ప్రాంతంలో చిరుతపులి సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో స్థానిక 300 క్వార్టర్స్ ప్రాంతంలో చిరుతపులి ఒక కుక్కను పట్టుకెళ్లింది. గత 15 రోజులుగా ఈ ప్రాంతంలో చిరుతపులి సంచారం జరుగుతోంది. దీనితో కాలనీవాసులు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి, చిరుతపులి సంచారాన్ని అరికట్టి, ప్రజల భద్రతకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### కామారెడ్డి బస్టాండ్‌లో

## గుర్తు తెలియని వృద్ధుడు మృతి

కామారెడ్డి, : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని టీఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గురువారం ఉదయం గుర్తుతెలియని 65 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. బస్సులు లోపలికి వెళ్లే మార్గంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడిని గుర్తించిన వారు సమాచారం అందించాలని పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది.

### నాచారం దుర్గానగర్‌లో

## యాచకుడి అనుమానాస్పద మృతి

సికింద్రాబాద్,: %నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గానగర్ లో 55 ఏళ్ల యాచకుడు రాత్రి మరణించాడు. బ్లూ కలర్ టీ షర్టు, లుంగీ ధరించిన ఇతడు, గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో యాచిస్తూ బయట నిద్రిస్తున్నాడని కాలనీవాసులు తెలిపారు. మృతుడి గురించి తెలిసినవారు ఎవరైనా ఉంటే నాచారం పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

### పాడి పరిశ్రమ అభివృద్ధికి

## తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చొరవ

మహేశ్వరం, : విజయ డెయిరీ డిప్యూటీ డైరక్టర్ మోహన్ మురళి, తెలంగాణ ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వినియోగదారులకు స్వచ్ఛమైన పాలు అందించడమే లక్ష్యంగా విజయ డెయిరీ పనిచేస్తుందని చెప్పారు.

గురువారం ఆయన రంగారెడ్డి జిల్లాలోని కడ్తాల్, మక్తమాధారం, చల్లంపల్లి, అమనగల్ గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలను పరిశీలించారు. స్వచ్ఛమైన పాల సేకరణ, నాణ్యతా ప్రమాణాలపై దృష్టి సారించాలని సూచించారు.

# బంధాన్ని బలపర్చే పండుగ.. రాఖీ పౌర్ణమి విశిష్టత

- అక్కా,చెల్లెళ్లపై అన్న,తమ్ముళ్ల ప్రేమను పటిష్టం చేసే పావన పర్వదినం
- అనాదిగా పరస్పర విశ్వాసానికి, భద్రతకు ప్రతీకగా మారిన పండుగ "రక్షాబంధన్"

**( వొడ్యాల వేణు- ప్రశ్న న్యూస్ ప్రతినిధి)**

శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి దినం – దేశవ్యాప్తంగా రక్షాబంధన్‌గా జరుపుకునే ఈ పర్వదినం అన్నా,చెల్లెళ్ల బంధాన్ని గుర్తుచేస్తుంది. ఇది కేవలం ఒక పండుగ కాదు, ఒక భావోద్వేగానికి, ఓ హృదయబంధానికి, ఓ నమ్మకానికి ప్రతీక. అక్కా, చెల్లెళ్ళు అన్నా, తమ్ముళ్ల చేతికి రాఖీ కడుతూ 'నన్ను నీవు రక్షించు' అని ఆశిస్తుంది. అన్నా, తమ్ముళ్లు మాత్రం 'నీ బాధ్యత మా మీదే' అంటూ మాటివ్వడం, మన దేశం సాంప్రదాయానికి ఎంత గొప్ప బలం ఉందో తెలియజేస్తుంది.

### చారిత్రక నేపథ్యం

రాఖీ పౌర్ణమి వెనక ఎన్నో పురాణ కథలున్నాయి. మహాభారతంలో ద్రౌపదీ శ్రీకృష్ణుని చేయికి రక్తం వచ్చినపుడు తన చీర కత్తిరించి రక్తం ఆపేందుకు కట్టిన ఘటనే ఈ పండుగకు మూలం అని చెబుతారు. కృష్ణుడు ఆ బంధాన్ని గుర్తుంచుకుని ద్రౌపదీ చెరలో పడ్డప్పుడు ఆమెను రక్షించాడు. మరో ఉదాహరణగా రాజపుత్ రాణి కర్ణావతి మొఘల్ చక్రవర్తి హుమాయూన్‌కి రాఖీ పంపినట్లు చారిత్రక గాథ ఉంది – ఆమెను రక్షించమని. ఈ ఘట్టాలు రాఖీ పౌర్ణమి వెనక ఉన్న పరస్పర నమ్మకానికి నిదర్శనాలు.

### సాంస్కృతిక ప్రాముఖ్యత

భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో రాఖీ పౌర్ణమికి విభిన్న రూపాలుంటాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో రాఖీ వేడుకలు కుటుంబ సమావేశాలుగా జరగడం సాధారణం. మహారాష్ట్రలో ఇది 'నారాళి పౌర్ణిమ'గా కూడా ప్రాచుర్యం పొందింది. దక్షిణ భారతంలో ఇది శ్రావణ పౌర్ణమిగా బృహస్పతి పూజలతో కూడిన ఆధ్యాత్మిక దినంగా భావిస్తారు. గ్రామీణ భారతంలో సోదర సోదరీమణులే కాక, వ్యవసాయాన్ని, పశువులను, ప్రకృతిని కూడా రక్షించుకోవాలని ఓ సంకేతంగా రాఖీ వేయడం జరుగుతుంది.

### ఆధునిక సందర్భంలో రాఖీ పౌర్ణమి..

ఇప్పటి తరం యువతలో కూడా రాఖీ పౌర్ణమి తన ప్రత్యేకతను నిలుపుకుంది. బంధుత్వాలకున్న ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ, సోదరుడు దేశంలో ఎక్కడ ఉన్నా – చెల్లెలు రాఖీ పంపుతుంది. డిజిటల్ యుగంలోనూ ఈ పండుగకు భిన్నరూపాలున్నాయి. మొబైల్ ఫోన్‌లో రాఖీ వీడియోలు, మెసేజులు, ఈ–గిఫ్టులూ పెరిగాయి. అలాగే, రక్తసంబంధం లేకపోయినా – మంచి మిత్రుడిగా, భద్రతాబద్ధతగా నిలిచే వారికీ రాఖీ కట్టడం ద్వారా రాఖీ భావన మరింత విస్తృతమవుతోంది.

### - సమకాలీన భారతంలో రాఖీకి మారిన అర్థాలు

ఈ పండుగను మరింత సార్థకంగా మార్చడానికి కొందరు సామాజిక సేవా సంస్థలు రక్షణ, ఆపద్బాంధవత్వానికి కొత్త నిర్వచనాల్ని జతచేస్తున్నాయి. పోలీసులు, సైనికుల చేతికి రాఖీ కడుతూ వారు దేశాన్ని కాపాడుతున్నందుకు ధన్యవాదం తెలుపుతున్నారు. మహిళా సంక్షేమం కోసం పని చేస్తున్న అనేక ఎన్.జి.ఓలు – రాఖీ పౌర్ణమిని మహిళల భద్రత కోసం ప్రతీకగా మారుస్తున్నాయి. కొన్ని చోట్ల బాలికలు చెట్లకు రాఖీలు కడుతూ పర్యావరణ పరిరక్షణకు సంకేతంగా నిలుస్తున్నాయి.

### - ముగింపు

రాఖీ పౌర్ణమి అనేది కేవలం ఒక ఆచారం కాదు – అది ఓ భావోద్వేగం. బంధాలను బలోపేతం చేసే ఒక వేదిక. మనం మన కుటుంబంతో, సమాజంతో కలబోసుకునే సమయమిది. మారుతున్న కాలంతో పాటు పండుగల నిర్వచనాలు మారవచ్చు గానీ – అక్కా చెల్లెళ్లపై అన్నదమ్ముల




ప్రేమకు,రక్షణకు నిలిచే ఈ పర్వదినం కాలం తాలూకు మచ్చే కాదు సంస్కృతికి నిలువెత్తు సాక్ష్యం.

## రాజన్నాలయంలో అభిషేక సేవలకు
# తాత్కాలిక విరామం

**- భక్తులు ముందస్తు ప్రణాళికతో రావాలి**

**- వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి : రాధాభాయి**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) శ్రావణమాసంలో భక్తుల ప్రవాహం పెరిగే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఆలయంలో భక్తులచే స్వయంగా జరిపించే అభిషేక సేవలను నిర్దిష్ట తేదీల్లో తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి రాధాభాయి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**- ప్రకటన వివరాలు**

08 ఆగస్టు (శుక్రవారం – వరలక్ష్మీ వ్రతం)
–09 ఆగస్టు (శనివారం – రాఖీ పౌర్ణమి)
– 15 ఆగస్టు (శుక్రవారం – స్వాతంత్ర దినోత్సవం)
– 16 ఆగస్టు (శనివారం – శ్రీకృష్ణాష్టమి)

తేదీల్లో స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం ఉండదు. పేర్కొన్న రోజుల్లో ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున,సమయం,స్థల పరిమితులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.అయితే, ఆలయ పూజా కార్యక్రమాలు, నిత్యసేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. అన్న పూజలు కూడా ఆలయ నిబంధనల ప్రకారం నిర్వహించబడతాయని స్పష్టం చేశారు.భక్తులు ఈ విషయం ముందుగా గమనించి తమ దర్శనాలను, సేవలను ప్రణాళికలు చేసుకోవాలని, ఆలయానికి సహకరించాలని దేవస్థానం వర్గం విజ్ఞప్తి చేసింది.

# ఇంటి వద్దకే ఎఫ్ఐఆర్

**ప్రయోగాత్మకంగా బాలానగర్ పిఎస్ లో అమలు**



కూకట్ పల్లి (ప్రశ్నన్యూస్) ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) కోసం ఫిర్యాదుదారులు పోలీసుస్టేషన్ల చుట్టూ తిరుగుతూ ఉండటం మనం చూస్తుంటాం. సైబరాబాద్ సిపి అవినాష్



మొహంతి, ఐపీస్, ఆదేశాల మేరకు బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలో సీఐ నర్సింహా రాజు నేతృత్వంలో ప్రయోగాత్మకంగా వయవృద్ధుల ఫిర్యాదు పై ఎఫ్ఎస్ఐఆర్ నమోదుచేసి పోలీస్ స్టేషన్ నుంచి సీఐ నర్సింహా రాజు, ఎస్ఐ సరితా పటేల్ రెడ్డి, వినోద్ తో కలిసి నేరుగా ఫిర్యాదుదారులు ఇంటికి వెళ్లి వాటిని గురువారం అందజేశారు. ఆశ్చర్యపోయిన ఫిర్యాదుదారులు, గమనించిన స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సైబరాబాద్ సిపికి, బాలానగర్ సీఐ నర్సింహా రాజుకు, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ న్యాయం కోసం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఎఫ్ఐఆర్ కాపీ కోసం అనేకసార్లు చక్కర్లు కొట్టాల్సిన అవసరం లేకుండా చూసేందుకు వయవృద్ధుల, వికలాంగులు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, ఎఫ్ఎస్ఐఆర్ నమోదుచేసి వారి ఇళ్లకు వెళ్లి అందిస్తే ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం మరింత విశ్వాసం పెంచాలనే ఉద్దేశంతో ఈ విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. అంతేకాక సున్నితమైన కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లు మఫ్టీలో ఇంటికి వెళ్లి ఎఫ్ఐఆర్ అందజేస్తామని వివరించారు.

## టౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో
# ఘనంగా రాఖీ వేడుకలు

**-పాల్గొన్న టౌన్ సిఐ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్సై మల్లేష్**



జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్)జగిత్యాల పట్టణంలోని టౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారని తెలిపారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జగిత్యాల పట్టణానికి చెందిన అభ్యాస పాఠశాల విద్యార్థినిలు పోలీసులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టౌన్ సిఐ కరుణాకర్, మాట్లాడుతూ రాఖి పండగ అక్కచెల్లెళ్లకు అన్నతమ్ములకు ఉన్న ఆత్మీయ బంధానికి గుర్తుగా అని తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై మల్లేష్ మాట్లాడుతూ రాఖి పండగ విశిష్టతను తెలిపారు.

## మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తే
# కఠిన చర్యలు తప్పవు

**- ఫోన్‌లో మహిళను అసభ్యంగా వేధించిన వ్యక్తికి రిమాండ్**

**- వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ : అంజయ్య**




వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ రూరల్ మండలం, అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి, ఒక మహిళకు ఫోన్ చేసి అసభ్యంగా ప్రవర్తించగా బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయంపై వేములవాడ రూరల్ ఎస్ఐ అంజయ్య స్పందిస్తూ "మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించినా, వేధింపులకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు. ఫోన్ లేదా సోషల్ మీడియా వేదికగా చేసే వేధింపులు కూడా తీవ్రమైన నేరాలుగా పరిగణిస్తాం. బాధిత మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులను లేదా షీ టీమ్‌ను సంప్రదించాలి. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం" అని ఎస్సై అంజయ్య తెలిపారు.

## చేనేత రంగం భారతీయ సంస్కృతికి..!
# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక...!!

**- చేనేత కళాకారులకు "జాతీయ చేనేత దినోత్సవం" శుభాకాంక్షలు**

**- భాజపా చేనేత సెల్ మాజీ జిల్లాధ్యక్షులు : అనుమల్ల చంద్రమౌళి**



కరీంనగర్,(ప్రశ్న న్యూస్) జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ చేనేత విభాగం కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షులు అనుమల్ల చంద్రమౌళి జిల్లాలోని చేనేత కళాకారులకు,కార్మికులకు గురువారం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ "చేనేత రంగం భారతీయ సంస్కృతికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని" గుర్తుచేశారు. చేనేత కళాకారుల కృషి దేశ ప్రతిష్టను ప్రపంచానికి పరిచయం చేస్తుందని ఆయన అన్నారు.భాజపా కేంద్ర ప్రభుత్వం చేనేత రంగాన్ని అభివృద్ధి చేయడానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని,వాటిని ప్రతీ చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు."ముఖ్యంగా యువత చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించాలి. స్థానికంగా నేసిన వస్త్రాలు ధరిస్తే, మన కళాకారులకు ఆర్థిక బలం లభిస్తుంది" అని చంద్రమౌళి పిలుపునిచ్చారు.అంతేకాక, చేనేత కళాకారుల సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని చంద్రమౌళి హామీ ఇచ్చారు.

## దుబ్బాక గ్రామ ప్రజలను ప్రత్యేకంగా అభినందించిన ధర్పల్లి ఎస్సై కళ్యాణి



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో ఎస్సై ఆస్తి నేరాల దొంగతనాలు నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని చెప్పిన మాటలకు దుబ్బాక గ్రామ ప్రజలు రాత్రివేళ గస్తీ కాస్తున్నారు. ఈ క్రమంలో ఎస్సై కళ్యాణి , బుధవారం అర్ధరాత్రి పెట్రోలింగ్ లో భాగంగా దుబ్బాక గ్రామానికి వెళ్లగా,అక్కడ కొంత మంది గ్రామస్థులు గస్తీ కాస్తున్నారు. వారిని ప్రత్యేకంగా అభినందించి,వారికి చాయ్ అందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీసులకు ప్రజలు అండగా ఉంటే నేరాల నియంత్రణ సాధ్యమవుతుంది. గ్రామస్థుల సహకారం శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది అని పేర్కొన్నారు.

## చేనేత కళ మన దేశపు సంస్కృతి కి ప్రతిరూపం

**- చేనేతరంగం సంక్షేమానికి విశేష కృషి చేస్తున్న భాజపా కేంద్ర ప్రభుత్వం**

**- భాజపా వేములవాడ పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**



వేములవాడ, (ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ వేములవాడ పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు."చేనేత కళ మన దేశపు సంస్కృతికి ప్రతిరూపం. పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చిన ఈ కళను ప్రోత్సహించడం మనందరి బాధ్యత. చేనేత రంగంలో పని చేసే కళాకారులు,కార్మికుల శ్రమ ఎంతో అమూల్యం. వారు తయారు చేసే వస్త్రాలు పర్యావరణహితంగా ఉండటంతో పాటు దేశ గౌరవాన్ని ప్రతిబింబిస్తాయి.చేనేత రంగాన్ని బలోపేతం చేయడంలో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో చేనేత వర్గాల కోసం పలు సంక్షేమ పథకాలు,నిధులు, మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. 'ఓన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్', 'వోకల్ ఫర్ లోకల్', 'హస్తకళాభారత' వంటి కార్యక్రమాలు చేనేత అభివృద్ధికి దోహదపడుతున్నాయి.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కళాకారులకు,కార్మికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. భవిష్యత్తులో మరింత ఉత్తమమైన అవకాశాలు ఈ రంగానికి అందాలని ఆకాంక్షిస్తున్నాను," అని రాపెల్లి శ్రీధర్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇద్దరు తెలుగు వలస కార్మికులకు అండగా"
## ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక సంఘం"

**- వైద్య ఖర్చులకు రూ. 50 వేలు**

**- విమాన టికెట్ కోసం రూ. 24 వేలు అందజేసిన ఈ.టి.సి.ఏ. ఔదార్యం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) విదేశాల్లో వలస కార్మికుల జీవితం ఎన్నో కష్టాల మధ్య సాగుతుంది. ముఖ్యంగా అకాల అనారోగ్యం, ప్రమాదాలు ఎదురైతే కుటుంబాల జీవితం కుదేలవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో దుబాయ్‌లో ఉన్న "ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక సంక్షేమ సంఘం" (ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్) మానవతా దృక్పథంతో ముందుకొచ్చింది.

**వివరాలు**

రాజన్న.సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని రత్నంపేట గ్రామానికి చెందిన ఎదురుగట్ల నాగరాజు (41) దుబాయ్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో గత పదేళ్లుగా పనిచేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అతన్ని అత్యవసర విభాగంలో ఆస్పత్రిలో చేర్పించారు. సర్జరీ అనంతరం అతను పాక్షికంగా పక్షవాతం బారిన పడ్డారు. ఈ విషయాన్ని తన మిత్రుడు, అదే గ్రామానికి చెందిన కౌడగాని సత్యనారాయణ ద్వారా ఈటీసీఏ ఫౌండర్ కిరణ్ కుమార్ పీచర్‌కు తెలియజేయగా వెంటనే స్పందించిన సంఘం వెల్ఫేర్ కమిటీ సభ్యులు రాజేష్ పోలంపల్లి,కార్తీక్ రెడ్డి ఆస్పత్రిని సందర్శించి, నాగరాజు పరిస్థితిని సమీక్షించారు. కంపెనీతో సమన్వయం జరిపిన ఈటీసీఏ సభ్యుల ప్రయత్నాలతో అతన్ని స్వదేశానికి పంపించగా, కారా?నా వైద్య ఖర్చుల భారం కింద రూ. 50,000 ఆర్థిక సహాయాన్ని సభ్యుల విరాళాల ద్వారా సమకూర్చి, ఇండియాకు వచ్చిన ఈటీసీఏ అధ్యక్షుడు జగదీశ్ రావు చీటీ, అడ్వైజరీ మెంబర్ సురేష్ రెడ్డి కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజు భార్యకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె సంఘానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది.

**మరో సంఘటన**

జగిత్యాల జిల్లాకు చెందిన దేవికొండ గ్రామానికి చెందిన మామిడి రాజు (28) బైక్ ప్రమాదంలో ఎడమకాలు కోల్పోయి తీవ్రంగా గాయపడ్డాడు.వైద్య సహాయం అనంతరం స్వదేశానికి వెళ్లాలన్న ఆశతో ఈటీసీఏ ను ఆశ్రయించాడు. స్పందించిన ఎగ్జిక్యూటివ్ మెంబెర్ మొహమ్మద్ అజహర్ ఖాన్, అబుదాబిలో రూ. 24,000 విలువైన విమాన టికెట్ అందజేసి మానవతా విలువలు నిలబెట్టారు. విదేశాల్లో జీవించే తెలుగువారి సంక్షేమం కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉండే ఈటీసీఏ సంస్థనిర్వహించిన ఈ సేవా కార్యక్రమాలు అభినందనీయంగా నిలుస్తున్నాయి.

## జగ్గారావుపల్లి శివారులో
# పేకాటస్థావరం పై పోలీసుల దాడి

**- ఐదుగురు అరెస్ట్,ముగ్గురు పరారీ**

**- 4 సెల్ ఫోన్లు,ఒక బైక్, రూ.7200 నగదు స్వాధీనం**

**- బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ : రాజా కుమార్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండలంలోని జగ్గారావుపల్లి గ్రామ శివారులోని వరద కాలువ పక్కన కొంతమంది పేకాట ఆడుతున్నారన్న సమాచారం ఆధారంగా బోయినిపల్లి ఎస్ఐ రాజా కుమార్ వెంటనే స్పందించారు. ఆయన తన సిబ్బందితో పేకాట స్థావరం చేరుకొని ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఐదుగురు పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేయగా,మిగతా ముగ్గురు పరారయ్యారు. అరెస్టైన వారు గంగాధర మండలానికి చెందినవారుగా గుర్తించినట్లు, వారి వద్ద నుండి నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం, రూ.7200 నగదు స్వాధీనం చేసుకొని,కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజా కుమార్ వెల్లడించారు.

## దేవిపట్నం మండలంలో యువతి కిడ్నాప్

**అల్లూరి** అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలో కిడ్నాప్ కలకలం రేగింది. సౌమ్య అనే మహిళను కత్తులు చూపించి కొందరు అపహరించుకుపోయారు. శరభవరం సచివాలయంలో ఆమె ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. దుండగులు వాళ్లనూ బెదిరించి ఆమెను ఎత్తుకెళ్లిపోయారు. ఈ ఘటనతో ఏజెన్సీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. సౌమ్యను ఎవరు.. ఎందుకు కిడ్నాప్ చేశారు? అనే దానిపై పోలీసుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

## సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా వుండాలి

**బాపట్ల** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకట మురళి సూచించారు. డెంగ్యూ కేసులు నమోదైన బాపట్ల చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాల్లో ఆయన పర్యటించారు. ఈదుపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ వ్యాప్తి నివారణకు, కేసులు నమోదైన ప్రాంతాల చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో లార్వా నిర్మూలనకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరం తాహసీల్దార్ శ్రీనివాసరావు ఈ సందర్భంగా ఆయనతో పాటు ఉన్నారు.

## వుయ్ వాంట్ ఫ్యాకల్టీ అంటూ
# నిరసనకు దిగిన గురుకుల విద్యార్థినులు

**వికారాబాద్** వికారాబాద్ జిల్లా పరిగి పరిధిలోని తుంకుల్ గడ్డలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల కళాశాలలో రెండు నెలలుగా మ్యాథ్స్, కెమిస్ట్రీ ఉపాధ్యాయులు లేరని విద్యార్థినులు నిరసనకు దిగారు. ఫ్యాకల్టీ గురించి నిలదీస్తే డిజిటల్ క్లాసులు విని సర్దుకోమని కళాశాల యాజమాన్యం చెప్పిందని అంటున్నారు. ఫా కల్టీ వస్తేనే తరగతి గదిలోకి వెళ్తామని.. డిజిటల్ క్లాసులు వింటున్నప్పుడు డౌట్లు వస్తే ఎవరిని అడగాలని విద్యార్థినులు ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్ వచ్చి ఫ్యాకల్టీని నియమించే వరకు నిరసన ఆపేదిలేదని, స్పందించకపోతే హైవేపై బైఠాయిస్తామని విద్యార్థినులు హెచ్చరించారు.



# శృతిహాసన్ చుట్టూ కూలీ ట్విస్టులు?

టాలీవుడ్ ఒకప్పుడు గబ్బర్ సింగ్, బలుపు, శ్రీమంతుడు లాంటి బ్లాక్ బస్టర్లతో మంచి స్టార్ డమ్ ఎంజాయ్ చేసిన శృతి హాసన్ కాటమ రాయుడు తర్వాత కనిపించకుండా పోయింది. మళ్ళీ సలార్ లో దర్శనమిచ్చింది. అందులో ప్రభాస్ సరసన ఆడి పాడకపోయినా కాస్త చెప్పుకోదగ్గ పాత్రే దక్కింది. తాజాగా కూలీలో ఫుల్ లెన్త్ రోల్ చేసింది. అయితే ఇందులో తను హీరోయిన్ కాదు. కమర్షియల్ ఎలిమెంట్స్ ఈమెకు పెట్టలేదు. అయితే చెన్నై వర్గాల కథనం ప్రకారం కూలీలోని కీలకమైన ట్విస్టులన్నీ ఈమె చుట్టే ఉంటాయట. ఒకవేళ నిజమైతే కనక ఫ్యాన్స్ కి పండగే. అవేంటో చూస్తే మీకే క్లారిటీ వస్తుంది.శృతి హాసన్ తండ్రైన సత్యరాజ్ హార్బర్ లో జరిగే మాఫియా రహస్యాలను వెతికి తీసే పనిలో ఉంటాడు. ఈ క్రమంలోనే రజినీకాంత్ తో ఏర్పడిన స్నేహం బంధంగా మారుతుంది. కొన్ని అనూహ్య సంఘటనల తర్వాత రజని, సత్యరాజ్ ఇద్దరూ మాయమైపోతారు. శృతి హాసన్ తండ్రిని వెతికే క్రమంలో నాగార్జున చీకటి ప్రపంచాన్ని బయటికి తెస్తుంది. దీంతో ఆమెను చంపే ప్రయత్నాలు మొదలవుతాయి. అప్పుడే రీ ఎంట్రీ ఇస్తాడు రజని. అయితే వెతుకుతున్న తండ్రికి బదులు ఆయన ఫ్రెండ్ కనిపించడం శృతిని షాక్ కు గురి చేస్తుంది. ఇద్దరూ కలిసి వేట మొదలెడతారు. వినడానికి బాగానే ఉంది కానీ ఇదెంత వరకు నిజమో ఆగస్ట్ 14 తెలుస్తుంది. టైం ట్రావెల్ అని ఒకరు, సై ఫై బ్యాక్ డ్రాపని ఇంకొకరు ఇలా కూలి ట్రైలర్ మీద రకరకాల డీ కోడింగ్స్ జరుగుతూనే ఉన్నాయి. లోకేష్ కనగరాజ్ వాటిని కొట్టిపారేయడం లేదు. థియేటర్ లో చూశాక సర్ప్రైజ్ అవుతారని అంటున్నాడు. వార్ 2తో పాటు ఒకే రోజు రిలీజవుతున్న కూలి అంచనాలు అంతకంతా ఎగబాకుతున్నాయి.

# కన్నడ దర్శకుడితో మాస్ రాజా?



తెలుగులో ఒక చిత్రానికి, ఇంకో చిత్రానికి పెద్దగా గ్యాప్ లేకుండా.. చాలా వేగంగా సినిమాలు చేసుకుపోయే స్టార్ హీరోల్లో మాస్ రాజా రవితేజ ఒకరు. హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా ఆయన స్పీడు చూపిస్తుంటారు. ఒక సినిమా పూర్తయ్యేలోపు ఇంకో సినిమాకు అన్నీ రెడీ చేసుకుని.. ఇది అవ్వగానే దాని మీదికి వెళ్లిపోతుంటారాయన. కొన్ని సందర్భాల్లో ఒకేసారి రెండు సినిమాల్లోనూ నటిస్తుంటారు మాస్ రాజా. ప్రస్తుతం ఆయన 'మాస్ జాతర' సినిమాను పూర్తి చేయనున్నారు.ఇది చివరి దశలో ఉండగానే కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఓ చిత్రాన్ని రవితేజ మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. అది కూడా దాదాపు సగం చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈలోపు రవితేజ చేయబోయే మరో సినిమాకు రంగం సిద్ధమవుతోంది. ఈసారి మాస్ రాజా ఓ కన్నడ దర్శకుడితో జట్టు కట్టబోతుండడం విశేషం. తన పేరు.. ఏపీ అర్జున్. సీనియర్ హీరో అర్జున్ మేనల్లుడైన ధ్రువ్ సర్జాతో 'మార్టిన్' సినిమా తీసిన దర్శకుడు.. ఏపీ అర్జున్. పాన్ ఇండియా స్థాయిలో రిలీజైన 'మార్టిన్' ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. మాస్ పేరుతో మరీ క్రింజ్ సీన్లు తీశారంటూ ట్రోలింగ్ కూడా జరిగింది ఆ సినిమా రిలీజ్ టైంలో. కాకపోతే మాస్ పల్స్ తెలిసిన దర్శకుడిగా అర్జున్‌కు పేరొచ్చింది.

# తూర్పుకనుమల్లో 'ఘాటీ' సామ్రాజ్యం



మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి తర్వాత ఏడాదిన్నరకు పైగా గ్యాప్ తీసుకున్న అనుష్క వచ్చే నెల సెప్టెంబర్ 5 ఘటిగా రాబోతోంది. పలు వాయిదాల అనంతరం ఎట్టకేలకు రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్నారు. క్రిష్ దర్శకత్వం వహించిన ఈ గ్యాంగ్ స్టర్ డ్రామాలో అనుష్క సరసన తమిళ నటుడు విక్రమ్ ప్రభు హీరోగా నటించాడు. ఇందులో అనుష్క గంజాయి అమ్మే ఊర మాస్ వయొలెన్స్ పాత్ర చేసింది. ఇప్పటిదాకా కంటెంట్ పరంగా ఎలాంటి క్లూస్ ఇవ్వకుండా దాచి పెట్టిన యువి టీమ్ తాజాగా ట్రైలర్ కట్ తో కథను చెప్పే ప్రయత్నం చేసింది. చెప్పాలంటే ఊహించిన దానికన్నా కంటెంట్ బలంగా ఉంది. ఎత్తయిన కొండలను సునాయాసంగా ఎక్కుతారని ఘాటీలకు పేరు. ఈ తెగకు చెందిన వాళ్ళు ఎవరైనా ఆడామగ తేడా లేకుండా ఎంతటి ప్రమాదానికైనా తెగబడతారు. వాళ్లలో ఒక అందమైన జంట (అనుష్క – విక్రమ్ ప్రభు) కూడా ఉంటుంది. గంజాయి వ్యాపారంతో కోట్లు సంపాదిస్తున్న లోకల్ డాన్ (చైతన్య రావు) ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఒక దశ దాటాక ఘాటీల్లో తిరుగుబాటు మొదలవుతుంది. తాము చేస్తున్న పని వల్ల అమాయకుల ప్రాణాలు పోతున్నాయని గుర్తించి హింసకు తెగబడతాడతారు. మరి ఘాటీల దొమ్మీలో దొరలు ఏమయ్యారో తెలియాలంటే ఇంకో నెల రోజులు ఆగాల్సిందే. దర్శకుడు క్రిష్ తన రెగ్యులర్ స్టైల్ కి భిన్నంగా ఈసారి పూర్తిగా మాస్ టర్న్ తీసుకున్నారు. పుష్ప, కెజిఎఫ్ తరహా బ్యాక్ గ్రౌండ్ అనిపిస్తున్నప్పటికీ కొండలు, గంజాయి, గిరిజన తెగలు, అడవులు వగైరా విజువల్స్ ఆసక్తికరంగా ఉన్నాయి.

# వార్ 2 అతి జాగ్రత్త పడుతోందా



ఇంకో ఎనిమిది రోజుల్లో విడుదల కానున్న వార్ 2 ప్రమోషన్లకు సంబంధించి యష్ రాజ్ ఫిలిమ్స్ దూకుడు చూపించడం లేదని ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓవర్సీస్ బుకింగ్స్ దేవర స్థాయిలో వేగంగా లేకపోవడానికి ఇదే కారణంగా పేర్కొంటున్నారు. హృతిక్ రోషన్ పలు ఈవెంట్లలో కనిపిస్తూ కబుర్లు పంచుకుంటున్నాడు కానీ జూనియర్ ఎన్టీఆర్ దర్శనం ఇంకా జరగకపోవడం అభిమానుల అసహనాన్ని పెంచుతోంది. రిలీజ్ కు రెండు మూడు రోజుల ముందు హడావిడి చేయడం కన్నా ఇలాంటి ప్యాన్ ఇండియా మూవీస్ కి కనీసం పది రోజుల ముందస్తు ప్లానింగ్ అవసరమన్న వాళ్ళ అభిప్రాయాన్ని కొట్టి పారేయలేం. ఇప్పటిదాకా బయటికొచ్చింది ఒక పాటే. అది కూడా హృతిక్ రోషన్ %-% కియారా అద్వానీల అయాన్ జవాన్ సాంగ్. తాజాగా దాని మేకింగ్ వీడియోని బయటికి వదిలారు. కానీ అసలు తారక్ కి జోడి ఉందో లేదో కూడా బయటికి చెప్పకపోవడం ఆశ్చర్యమే. ఇద్దరు హీరోల డాన్స్ తాలూకు వీడియో ప్రోమో చిన్నది కట్ చేయించారు కానీ, అది కూడా రేపు గ్లిమ్ప్ రూపంలో రిలీజ్ కానుంది. ఫుల్ వీడియో కాదు. తెలుగు రాష్ట్రాల్లో టికెట్ పెంపు కోసం ప్రయత్నాలు చేస్తున్న వార్ 2 పబ్లిసిటీ మీద దృష్టి పెట్టాల్సిన టైం అయితే వచ్చింది. సోమవారం నుంచి ఈ పనులు చూస్తానని చెప్పిన డిస్ట్రిబ్యూటర్ నాగవంశీ వైపు ఎలాంటి మూమెంట్ లేదు. ఒకవేళ పోటీలో కూలీ లేకపోయి ఉంటే ఇంతగా డిస్కస్ చేసుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ ఒకవైపు రజనీకాంత్ మాస్ బుకింగ్స్ తో దూసుకుపోవడంతో ఓపెనింగ్స్ విషయంలో దెబ్బ పడుతుందేమోననే టెన్షన్ తారక్ ఫ్యాన్స్ లో రావడం సహజం.


# నో కాంప్రమైజ్ అంటున్న ఖైదీ 2



స్టార్ డైరెక్టర్లను ప్రశ్నలు అడిగే క్రమంలో కొందరు శృతి తప్పేస్తూ ఇంకొకరిని కించపరిచేలా మాట్లాడ్డం తరచుగా జరుగుతోంది. కూలి ప్రమోషన్లలో భాగంగా లోకేష్ కనగరాజ్ కు ఒక క్వశ్చన్ ఎదురయ్యింది. విజయ్, కమల్ హాసన్, రజనీకాంత్ లాంటి టాప్ స్టార్స్ ని హ్యాండిల్ చేశాక ఖైదీ 2 కోసం కార్తీ లాంటి టయర్ 2 హీరోతో చేయడం పట్ల ఎలా ఫీలవుతున్నారని ఇంటర్వ్యూయర్ అడిగాడు. దానికి లోకేష్ సమాధానమిస్తూ నేను ఋజువు చేసుకోవాల్సిన టైంలో ఖైదీ రూపంలో అవకాశం ఇచ్చి వెన్ను తట్టింది కార్తీనే అని, ఆయనే తనకు పెద్ద స్టార్ అని, సీక్వెల్ తో పెద్ద హిట్ ఇస్తానని పేలిపోయే సమాధానం ఇచ్చాడు.ఖైదీ 2కి సంబంధించి లోకేష్ కనగరాజ్ ఇప్పటికే 35 పేజీలకు పైగా స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నాడు. కూలి రిలీజైన తర్వాత కొద్దిరోజులు బ్రేక్ చేసుకుని ఫైనల్ వెర్షన్ పనులు చూసుకోబోతున్నాడు.

అటు కార్తీ కూడా మూడు సినిమాలతో బిజీ ఉన్నాడు. అవన్నీ పూర్తవ్వడానికి ఈ ఏడాది గడిచిపోయేలా ఉంది. సో డిసెంబర్ నుంచి పార్ట్ 2 షూటింగ్ ఎక్స్ పెక్ట్ చేయొచ్చు. ఖైదీ 2లో జైలు నుంచి బయటికి వచ్చిన ఢిల్లీ గతంలో ఏం చేశాడు, అతనికి విక్రమ్, రోలెక్స్ లతో ఉన్న సంబంధం ఏంటి, ఈ ముగ్గురు లోకేష్ యునివర్స్ లో ఎలా కలవబోతున్నారనే పాయింట్ కోసం ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత కొంత కాలంగా సరైన బ్లాక్ బస్టర్ లేక ఇబ్బంది పడుతున్న కార్తీకి ఖైదీ 2 మరో పెద్ద బ్రేక్ కానుంది. ఇది పూర్తి చేశాకే లోకేష్ కనగరాజ్ అమీర్ ఖాన్ తో చేయబోయే ప్యాన్ ఇండియా మూవీకి రెడీ అవుతాడు.

# మంచు మనోజ్ సరైన దారిలో పడ్డాడు



ఇటీవలే భైరవంలో విలన్ గా రీ ఎంట్రీ ఇచ్చిన మంచు మనోజ్ కు ఆశించిన కంబ్యాక్ దక్కలేదు కానీ ఇకపై నటనను సీరియస్ గా తీసుకుని వరసగా సినిమాలు చేసే సందేశమైతే ఇచ్చాడు. సెప్టెంబర్ లో విడుదల కాబోతున్న మిరాయ్ లో ప్రతినాయకుడిగా నటించిన మనోజ్ ఇంకోవైపు హీరోగానూ కెరీర్ ని బలపరుచుకునే పనిలో ఉన్నాడు. తాజాగా డేవిడ్ రెడ్డి అనే ప్రాజెక్టు అనౌన్స్ అయ్యింది. హనుమ రెడ్డి యక్కంటి దర్శకత్వంలో రూపొందబోయే ఈ పీరియాడిక్ డ్రామాలో మనోజ్ బ్రిటిషర్ల కాలంలో ఆంగ్లేయులకు తిరగబడిన యోధుడి పాత్రను పోషించనున్నాడు, బడ్జెట్ కూడా ప్యాన్ ఇండియా లెవెల్ లో ఖర్చు పెడుతున్నారు. దీంతో పాటు కార్తికేయతో 90 ఎంఎల్ తీసిన శేఖర్ రెడ్డికి మనోజ్ ఇంతకు ముందే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. జూన్ నెలలో పుట్టినరోజు సందర్భంగా ప్రకటిద్దామనుకున్నారు కానీ క్యాస్టింగ్ తదితర కారణాల వల్ల వాయిదా వేశారు. దీనికి అత్తరు సాయిబు టైటిల్ పరిశీలనలో ఉంది. అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైనర్ గా పోటుగాడు, దొంగ దొంగది, మిస్టర్ నూకయ్య తరహాలో మాస్ ప్లస్ కామెడీ రెండూ ఇందులో ఉంటాయట. చిత్రీకరణ ఎప్పుడు మొదలుపెట్టేది ఇంకా తెలియాల్సి ఉంది. ఇంతకు ముందు ఎప్పుడో ప్రారంభమైన వాట్ ది ఫిష్ సైతం మళ్ళీ రీ స్టార్ట్ అయ్యే ప్రణాళికలో ఉన్నట్టు ఫిలిం నగర్ టాక్. మొత్తానికి మంచు మనోజ్ సరైన ప్లానింగ్ తో బిజీగా మారబోతున్నాడు. ఆ మధ్య కుటుంబ కలహాల వల్ల మీడియాలో హైలైట్ అయిన మనోజ్ ఇకపై సినిమాల ద్వారానే తమ ముందుకు రావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. సరైన హిట్ పడాలే కానీ సెకండ్ ఇన్నింగ్స్ మంచిగా నిర్మించుకోవచ్చు. తన వయసు ఫామ్ లో లేని హీరోలు క్యారెక్టర్ ఆరిస్టులుగా మారిపోయిన ట్రెండ్ లో మంచు మనోజ్ ని పెట్టి ఇంకా హీరోగా సినిమాలు తీస్తున్నారంటే తన థియేటర్ ఫుల్ మీద ఉన్న నమ్మకమే. కాకపోతే దాన్ని నిలబెట్టుకునే స్థాయిలో రెండు హిట్లు పడితే సెటిలైపోవచ్చు. ఇకపై గ్యాప్ అయితే రానివ్వనంటున్నాడు మనోజ్.

# అమ్మాయిలను అమ్మోరులా పెంచాలి



30 రోజుల్లో ప్రేమించడం ఎలా' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న డైరెక్టర్ మున్నా ధులిపూడి నుంచి వస్తున్న మరో చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ట్యాగ్ లైన్. అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రంలో రోహన్ సూర్య, మొయిన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నీలి నీలి ఆకాశం క్రియేషన్స్, ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై శశిధర్ నల్లా, ఎమ్మాడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ లిరిసిస్ట్ చంద్రబోస్ సాహిత్యం అందిస్తున్న ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్ మోషన్ పోస్టర్‌ను ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన గ్రాండ్ ప్రెస్‌మీట్‌లో దర్శకులు చందూ మొండేటి, శివ నిర్వాణ, కృష్ణ చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొని విడుదల చేశారు. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ "30 రోజుల్లో ప్రేమించడం ఎలా తర్వాత నేను మున్నాతో కలిసి వర్క్ చేస్తున్నా. ఈ సినిమా కూడా అద్భుతమైన చిత్రం అవుతుంది"అని పేర్కొన్నారు. డైరెక్టర్ మున్నా మాట్లాడుతూ.. 'ఈ స్టోరీకి ఎంతోమంది అమ్మాయిల కథలు స్ఫూర్తినిచ్చాయి. అమ్మాయిలను పేరెంట్స్ భయంతో పెంచుతారు. అమ్మాయిలను భయంతో కాదు ధైర్యంతో పెంచాలి అని చెప్పే కథ ఇది. అమ్మాయిలను అమ్మోరులా పెంచాలి"అని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రం, నాగేశ్వరరెడ్డి, మొయిన్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

## గాజుల అలంకరణలో వాసవి మాత



నాచారం(ప్రశ్న న్యూస్) శ్రావణమాసం సందర్భంగా శ్రీ వాసవి అమ్మవారిని శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. మల్కాజిగిరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మాతను గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాత శ్రీనివాస్ జనరల్ సెక్రటరీ ఆలంపల్లి సురేష్, కోశాధికారి బి వై ఎస్ గుప్తా, నాచారం వాసవి ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బొగ్గారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం



నాచారం(ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కప్పర సాయి కిరణ్ అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీ ఫేస్ టు రోడ్లు మరియు భోగర్భ డ్రైనేజీ పనులకు నిధులను మంజూరు చేసినందుకు కాలనీ వాసులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కప్పర సాయికిరణ్ గౌడ్ మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో కాలనీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, వర్షాకాలం కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. నేటి ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయామని కాలనీవాసులు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తమ కాలనీ అభివృద్ధి కోసం ఇప్పటివరకు కోటి రూపాయలకు పైగా నిధులు మంజూరు చేశారని హర్షం వ్యక్తం చేశారు. కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డికి సాయి కిరణ్ లకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, దంతురి రాజు గౌడ్, జెమిలా బేగం, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోయగూర బాలరాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మనోహర్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ జానీభై, పర్వతాలు, మ్యూజిబ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మెరుపుల జయంత్, ప్రణీత్, అజిమ్, మరియు కాలనీ అధ్యక్షులు అల్తాప్, మురళి, విజయ్, ప్రశాంత్, కాలని వాసులు పాల్గొన్నారు

## ఘనంగా పోతగాని గోపాల్ గౌడ్ జన్మదిన వేడుకలు



నాచారం(ప్రశ్న న్యూస్) నాచారం డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు, మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ జన్మదిన వేడుకలు డివిజన్ బిజెపి నాయకులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వారి నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పార్టీలకు అతీతంగా నాయకులు, పలు కాలనీ సంఘాల సభ్యులు,కుల సంఘాల నాయకులు,జేఏసీ సభ్యులు,వ్యాపారవేత్తలు కాలానీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గోపాల్ గౌడ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా పోతగాని గోపాల్ గౌడ్ మాట్లాడుతూ నా జన్మదినాన్ని పురస్కరించుకొని నాకు ప్రత్యక్షంగాను,పరోక్షంగా పార్టీలకు అతీతంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. ఈ ప్రేమ,అభిమానం ఎల్లపుడు ఇలానే ఉండాలని ఆశిస్తున్నా అన్నారు. అదేవిదంగా అధికారం, పదవి ఉన్న లేకున్నా ఎల్లపుడు ప్రజ సేవలో, అందరికి అందుబాట్లో ఉంటానని నాచారం డివిజన్ అభివృద్ధి కి తోడ్పడతానని తెలియచేసారు.

## క్యూబా దేశం కోసం సంఘీభావ నిధి వసూళ్లు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)సీఐటీయూ అఖిలభారత కమిటీ పిలుపుమేరకు సిఐటియు మేడ్చల్ మండల్ కమిటీ ఆధ్వర్యంలో మెడిసిటీ సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో డాక్టర్స్, కార్మికుల వద్ద నుండి క్యూబా సంఘీభావనిధిని వసూళ్లు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మేడ్చల్ మండల నాయకులు నరేష్ మాట్లాడుతూ క్యూబా దేశాన్ని అమెరికా అనేక రకాలుగా అణచివేయాలని ప్రయత్నం చేస్తుందని, ఆ ప్రయత్నాలను తిప్పి కొట్టడం కోసం క్యూబాకు అందరూ మద్దతు తెలపాలని కోరారు, కరోనా కాలంలో క్యూబా తన డాక్టర్లను ప్రపంచంలోని ఇతర దేశాలకు పంపించి వైద్య సేవలు అందడం అనేటువంటిది మనందరం కళ్ళముందే చూసినటువంటి పరిస్థితి అని క్యూబా అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన దేశం అని ప్రపంచంలో మొదటిసారి సోషలిస్టు దేశంగా ప్రకటించుకున్నటువంటి మొట్టమొదటి దేశం క్యూబా దేశమని పేర్కొన్నారు. అలాంటి క్యూబా దేశాన్ని నాశనం చేయడం కోసం అమెరికా పావులు కదపడం అనేది దారుణమని అన్నారు. అమెరికాకు క్యూబా ఎంత దూరంలో ఉందో క్యూబాకు కూడా అమెరికా అంతే దూరంలో ఉందనే విషయాన్ని ట్రంప్ గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. క్యూబా దేశాన్ని కాపాడుకోవడం కోసం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఉన్న కార్మిక వర్గం తోడుగా ఉంటుందని ఆ దేశాన్ని రక్షించుకొని ప్రపంచానికి ఒక దిక్సూచిని సూచించగల శక్తి కార్మిక వర్గానికి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మెడిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దేవేందర్ నాయకులు బి.నర్సింగ్ రావు, నర్సింహా, వెంకటేష్, రమేష్, కృష్ణ, సుధాకర్, కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మెదక్ లో బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు ముఖ్య అతిథులుగా

# పాల్గొన్న మాజీ మంత్రులు హరీష్ రావు.నిరంజన్ రెడ్డి.

### నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి





మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ కలెక్టరేట్ ధర్నా చౌక్ వేదికగా కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న రైతు మోసాలపై జంగ్ సైరన్‌కు బీఆర్ఎస్ కు ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చినా హామీలు మర్చిండు.ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇవ్వలేదు.రేవంత్ రెడ్డి నైజం బయట పడింది... పరిపాలన రావడం లేదు.స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ది పొందెందుకే కాళేశ్వరం ప్రాజెక్ట్ ను బూచి గా చూపుతున్నారు.కెసిఆర్ వచ్చాక రైతు బందు, రైతు బీమా ఇచ్చారు.కాంగ్రెస్ వచ్చాక రుణమాఫీ, రైతు బందు, రైతు బీమా లేదు.రైతుల పక్షాన బిఆర్ఎస్ పోరాటం చేస్తుంది. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసింది.రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవు.కాంగ్రెస్ ప్రభుత్వం మీద బిఆర్ఎస్ చేస్తున్న పోరాటం ఆరంభం మాత్రమే.భవిష్యత్ లో ప్రజల కోసం మరిన్ని పోరాటాలు చేస్తాం.రేవంత్ రెడ్డి ఎన్ని జిమ్మిక్కులు చేసిన నమ్మరు.కెసిఆర్ పై అబద్దపు ప్రచారం చేస్తే ఊరుకోరు.తెలంగాణ కు మరోసారి కాబోయే సీఎం కెసిఆర్.మూడు రోజుల్లో నీళ్లు ఇవ్వకుంటే గేట్లు పగలగొట్టి నీళ్లు తీసుకుంటాం.

#### నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ

రైతు ను గౌరవంగా నిలబెట్టింది కెసిఆర్.రైతు కు మద్దతు ధర, బోనస్ ఇవ్వాలని అడుక్కునే దుస్థితి కాంగ్రెస్ పాలన లో ఉంది. రైతు సమస్యలపై కేటీఆర్ చర్చ కు వస్తే సీఎం రేవంత్ ఢిల్లీలో దాకున్నారు.ఎన్నికల్లో ఒకమాట గెలిచాక మరొమాట మాట్లాడుతున్నారు కాంగ్రెస్ నేతలు. రైతులకు బోనస్ ఇస్తామని ఎగగొట్టింది.పంట నష్టానికి ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. కెసిఆర్ 24గంటల కరెంట్ ఇచ్చారు.. ఇప్పుడు ఇవ్వడం లేదు.రైతు బీమా కెసిఆర్ సర్కార్ ఇస్తే కాంగ్రెస్ సర్కార్ ప్రీమియం ఇవ్వడం లేదు. ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని మోసం చేసింద్రు.ఆరు గ్యారెంటీలు అని మోసం చేసింది.రైతు వ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలి.ఘనపూర్ రైతులకు నీళ్లు ఇవ్వకుంటే మేమే వదులుకుంటాం.కాళేశ్వరం నీళ్ళు ఇవ్వాలి. కెసిఆర్ అగ్గి. అగ్గిని ముట్టుకుంటే మసి అవుతారు.రైతుల బోనస్ వెంటనే ఇవ్వాలి.

#### మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ

మెదక్ అంటేనే రైతుల అడ్డా రైతులకు ఎరువులు దొరకడం లేదు తెలంగాణ వచ్చాక చాలా సంతోష పడ్డాం.మిషన్ కాకతీయ ద్వారా చెరువులు అన్నీ బాగుచేశాం.ఉత్తమ్ కుమార్ రెడ్డి దిక్కు మాలిన మంత్రి.మెదక్ జిల్లా ప్రాజెక్ట్ ల మీద ఉత్తమ్ వివక్ష చూపుతున్నారు.జిల్లా మంత్రి దామోదర్ పనికిమాలిన మంత్రి.ఇంట్లో కూర్చొని కమిషన్లు దండుకుంటున్నారు.జిల్లా ఇంచార్జ్ మంత్రి కి మెదక్ జిల్లా గురించి ఎం తెలుసు.జగ్గారెడ్డి పర్సంటేజీ లు ఇస్తలేరని ఏడ్చాడు.
కాంగ్రెస్ శ్రేణులు వాళ్లకు వాళ్లే కొట్టాడుకుంటున్నారు.ఎమ్మెల్యే లకు ఇచ్చే నిధులు కూడా ఇవ్వడం లేదు.రెండేళ్ల లో ఎమ్మెల్యే కు ఒక లక్ష రూపాయలు కూడా ఇవ్వలేదు.దేశంలో ఏ రాష్ట్రంలో లేని పాలన తెలంగాణ లో కొనసాగుతుంది.బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టు లపై ప్రభుత్వానికి సోయి లేదు.కాళేశ్వరం లో పిల్లర్ పోతే ఇంకో పిల్లర్ పెట్టరా.ఏ ప్రాజెక్ట్ లో కూడా నీళు లేవు.కెసిఆర్ కట్టిన ప్రాజెక్ట్ ల్లో నీళ్లు లేవు.హ్యాం స్కిం ద్వారా రోడ్లు వేసి టోల్ వసూలు చేసుకునే కుట్ర కాంగ్రెస్ చేస్తోంది.పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలకు ఎస్కాట్ ఇస్తున్నారు.మల్లన్న సాగర్, కొండ పోచమ్మ నుంచి నీళ్లు వదులాలని కోరుకుంటున్న పట్టించుకోలేదు.

#### మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ

కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలనే ఉద్దేశ్యం తోనే బిఆర్ఎస్ ధర్నా.కాంగ్రెస్ రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది.రైతు డిక్లరేషన్ లో చెప్పిన హామీలను పూర్తిగా విస్మరించారు. రేవంత్ సర్కార్ కు బుద్ది చెప్పాలి.రైతులు ఆత్మహత్య లు చేసుకుంటున్న పట్టించుకోవడం లేదు.రాబోయే ఎన్నికల్లో ఓట్లతో కాంగ్రెస్ కు బుద్ది చెప్పాలి. ఆచరణ లో సాధ్యం కానీ హామీలిచ్చి గద్దెనెక్కారు. కెసిఆర్ బంగారు తెలంగాణ చేస్తే కాంగ్రెస్ నాశనం చేస్తోంది. ఇప్పటికిప్పుడు ఓట్లేస్తే కాంగ్రెస్ సర్కార్ ఇంటికి పంపుతారు. రైతు బంధు, రైతు బీమా ఇవ్వడం లేదు.

#### మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి మాట్లాడుతూ

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బంగాళాఖతం లో కలపాలి. ఘనపూర్ ఆయకట్టు నుంచి నీరు విడుదల చేయలేదు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి. రైతు రుణమాఫీ జరగలేదు.. రైతులకు బోనస్ ఇవ్వలేదు .

#### ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ..

కెసిఆర్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 24గంటల కరెంట్ ఇచ్చారు.ఉమ్మడి రాష్ట్రంలో ఐదారు గంటలు కూడా కరెంట్ ఇవ్వలేదు. చెక్ డ్యాం ల ద్వారా గ్రౌండ్ వాటర్ పెంచిన ఘనత కెసిఆర్ ది.తెలంగాణ రాక ముందు లక్ష ఎకరాల్లో ధాన్యం పండేది.. కెసిఆర్ వచ్చాక 4లక్షల ఎకరాల్లో ధాన్యం పండుతుంది.ఎరువుల కోసం తిప్పలు తప్పడం లేదు.కెసిఆర్ రైతు బీమా పేరుతో రూ 5లక్షలు ఇచ్చారు.కాంగ్రెస్ రైతు బీమా ను రెన్యూవల్ చేయలేదు.రైతుల దాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొన్నారు.కాంగ్రెస్ వస్తే రైతులకు కష్టాలు వస్తాయి అని అనుకున్నాం.. ఆ విదంగానే జరుగుతుంది. మెల్ ఫిమెల్ పంట పండించే రైతులు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారు.రైతులను నమ్మించి ఓట్లు వేసుకున్న కాంగ్రెస్.రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి గుణపాఠం నేర్పాలి అని కార్యకర్తల సమక్షంలో తెలియజేశారు.

## అత్వెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా విద్యార్థుల చేత రాఖీ తయారీ యొక్క పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు వారు ఇంటి వద్ద నుండి తెచ్చుకున్న సామాగ్రితో రంగురంగుల రాఖీలను తయారు చేసి ఆకట్టుకున్నారు. ఆ తరువాత నీవు నాకు రక్షా నేను నీకు రక్ష మనం పాఠశాలకు దేశానికి రక్షా అనే నినాదంతోటి విద్యార్థినీ విద్యార్థులందరూ ఒకరికి ఒకరు రక్షలు కట్టుకొని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడప నవీన్, పద్మలత, రంగారావు, రాంబాబు, వసీం, స్వరూపారాణి, విజయలక్ష్మి, రీతు, ప్రభాకర్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## మాన్వాడలో సీజనల్ వ్యాధుల నివారణకు ఉచిత వైద్య శిబిరం

**- కొదురుపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు**

**- డాక్టర్ రేణు ప్రియాంక**



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండలంలోని మాన్వాడ గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం సీజనల్ వ్యాధుల నివారణ లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కొదురుపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యాధికారి డాక్టర్ రేణు ప్రియాంక ఆదేశాల మేరకు, డాక్టర్ వినూత్న ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో మొత్తం 66 మంది గ్రామస్థులను వైద్యులు పరిశీలించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినూత్న, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ, ఏఎన్ఎం వినోద, ఆశా కార్యకర్త లక్ష్మి తదితర ఆరోగ్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ రేణు ప్రియాంక మాట్లాడుతూ "మాన్సూన్ సీజన్‌లో వివిధ రకాల వైరల్ జ్వరాలు, శ్వాస సంబంధిత ఇన్ఫెక్షన్లు, గ్యాస్ట్రో సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ప్రజలు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి. స్వచ్ఛత పాటించడం, ఆరోగ్యకరమైన నీరు, ఆహారం వినియోగించడం ముఖ్యం" అని తెలిపారు. గ్రామస్థులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పోలీసులకు రాఖీలు కట్టిన

### మాజీ కౌన్సిలర్ అమరం సరస్వతి మోహన్ రెడ్డి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో ఏసీపీ, సీఐ, ఎస్సై, కానిస్టేబుల్, సోదరులకు మాజీ కౌన్సిలర్ అమరం సరస్వతి మోహన్ రెడ్డి రాఖీ కట్టారు. ఈ




సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో కుటుంబాలకు దూరంగా ఉండి 24 గంటలు ఉద్యోగ నిర్వహణలో నిత్యం ప్రజల సమస్యలకు పరిష్కరించేందుకు పండుగలను తమ కుటుంబాలను వదిలి ప్రతిరోజు విధులకు హాజరై ప్రతి అక్కాచెల్లెళ్లకు మహిళలకు భద్రతగా మేము ఉన్నామంటూ ధైర్యం ఇచ్చే పోలీసులకు అక్కాచెల్లెళ్ల ఆత్మీయతను పంచడానికి మేమున్నాము అని గుర్తు చేస్తూ రాఖీలు కట్టడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు బట్టి కాడి నవనీత, ప్రధాన కార్యదర్శి పాకనాటి భారతి, రాష్ట్ర మహిళా మోర్చా స్పోక్స్ పర్సన్ వెలగపూనీ సరితారావు, కొంపల్లి మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మాధురి, సీనియర్ నాయకురాలు దుర్గ తదితరులు పాల్గొన్నారు..

## రాష్ట్ర నాయకులతో సీఎం సమావేశం

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారిక నివాసంలో నిర్వహించిన కీలక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,బీసీ,రవాణా శాఖ మంత్రి ఎండీ ప్రభాకర్,ఐటీ శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు లతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో వేములవాడ శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రాధాన్యతతో హాజరయ్యారు.

# అవినీతి చేయాలి ప్రశ్నిస్తే లీవ్ పెట్టాలి

## - జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ లో అధికారుల వింత ఆచారం

- మొన్న బేగంపేట సర్కిల్ ఏసిపి సుస్మిత, నేడు జూబ్లీహిల్స్ సర్కిల్ ఏసిపి ఇంజా శ్రీనివాస్
- టౌన్ ప్లానింగ్ ఏసిపి ఇంజ శ్రీనివాస్ పై ఫిర్యాదు చేసిన చర్యలకు జంకుతున్న కమిషనర్
- అక్రమ నిర్మాణాల అవినీతిలో టౌన్ ప్లానింగ్ అధికారుల భాగస్వామ్యం ఉందా.?
- అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేసిన ఎందుకు చర్యలు తీసుకోరు.?
- కాసులు కనబడితే అక్రమ నిర్మాణాలు కనపడవా.?
- టౌన్ ప్లానింగ్ అధికారుల అక్రమ ఆదాయంపై ఏసీబీ ఎంక్వయిరీ చెయ్యాలి
- కోట్లలో అవినీతి చేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు పట్టించుకోని ప్రభుత్వం
- జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో అధికారులకు నెలనెల మామూలు ఇస్తున్న సర్కిల్ ఏసీపిలు.?


ప్రజాప్రశ్న
శీనన్న వసుళ్ల దందాపై
ప్రజావాణిలో ఫిర్యాదు




ప్రజాప్రశ్న
నీ అవినీతికి హద్దు లేదు
నిన్ను ఆపే దమ్ము అధికారులకు లేదు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసి పరిధిలోని 30 సర్కిల్లో టౌన్ ప్లానింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఏసీపిలు, సెక్షన్ ఆఫీసర్లు భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడతారు ఎవరైనా ప్రశ్నించిన, పత్రికల్లో కథనాలు వచ్చిన అంతే తమకేది తెలియనట్టు "సుద్ధ పూసల వలె" అన్న చందంగా సెలవు పెట్టి వెళ్ళిపోతారు. తర్వాత సర్కిల్ మార్చుకొని వేరే దగ్గర విధులు నిర్వహిస్తూ మళ్లీ భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడతారు. ఈ వింత ఆచారాన్ని ఉన్నంత అధికారులు సైతం ప్రోత్సహిస్తూ వాళ్లకు సెలవులు మంజూరు చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమాలు ప్రోత్సహించడం అవినీతి చేయడం డబ్బులు సంపాదించుకోవడం సెలవులు పెట్టుకొని తప్పించుకోవడం మొన్న బేగంపేట సర్కిల్ ఏసిపి సుస్మిత నేడు బంజారాహిల్స్ సర్కిల్ ఏసీపి ఇంజా శ్రీనివాస్ అవినీతి అక్రమాలు బహిర్గతం కావడంతో సెలవు పై వెళ్లారు. వీళ్లకు సెలవులు ఉన్నత అధికారులు ఎలా మంజూరు చేశారని ఇందులో ఉన్నతాధికారుల వాటా ఎంత ఉందో అని ప్రజలు బహటంగా ప్రశ్నిస్తున్నారు. బంజారా హిల్స్ సర్కిల్ 18 లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉండే పరిధిలోనే ఆకాశానంటే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని టౌన్ ప్లానింగ్ ఏసిపి ఇంజ శ్రీనివాస్ కు స్థానికులు ఫిర్యాదు చేసిన పట్టించుకోకుండా అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలకాదని ఆరోపణలు వినిపిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులకు ఏసీపీ శ్రీనివాస్ పై ఫిర్యాదు చేసిన ఖైరతాబాద్ జోనల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ సిసిపి శ్రీనివాస్ కు లికిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. సర్కిల్ ల పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల వసూలు దందా లో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని ఉన్నత అధికారులకు సీసీపీకి ఏమైనా వాటాలు అందుతున్నాయా.? అందుకోసమే చర్యలు తీసుకోవడం లేదా అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. బంజారాహిల్స్ లో వివిఐపీలు ఉండే ప్రాంతంలో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు కోకోలలుగా నిర్మించారని అక్రమ నిర్మాణాలకు శ్రీనివాస్ ప్రోత్సాహంతో దాదాపు బంజారాహిల్స్ సర్కిల్ 100 వరకు పైగా అక్రమ నిర్మాణాలు జరిగాయని ఆధారాలతో సహా జిహెచ్ఎంసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఏసీబీ ఇంజ శ్రీనివాస్ పై శాఖపరమైన చర్యలు కానీ సస్పెండ్ కానీ చేయకపోవడం తో జిహెచ్ఎంసి కమిషనర్ ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### కమిషనర్ నిర్లక్ష్యమే అవినీతికి అర్థ్యం..

తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇంజ శ్రీనివాస్ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించారని ఆధారాలతో సహా జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేయడంతో తనపై శాఖా పరమైన చర్యలు అధికారులు తీసుకోకముందే సెలవు పెట్టి వెళ్లారని సమాచారం.? అక్రమ నిర్మాణాల పై గ్రేటర్ హైదరాబాద్ టౌన్ ప్లానింగ్ సిసిపి శ్రీనివాస్ శాఖ ప్రమైన చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బేగంపేట సర్కిల్ సుస్మిత, బంజారాహిల్స్ సర్కిల్ ఏసీపీ ఇంజ శ్రీనివాస్ అవినీతిలో సిసిపికి ఏమైనా వాటాలు ఉన్నాయా అందుకోసమే ఆయన చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని పదేపదే ఫిర్యాదులు వచ్చిన జిహెచ్ఎంసి కమిషనర్ పట్టించుకోకుండా టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్రీనివాస్ కు వత్తాసు పలికారా.? ఏసిపి శ్రీనివాస్ వాటాలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం అధికారుల వాటా ఎంత అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ లో టౌన్ ప్లానింగ్ లో ఉన్నంత అవినీతి ఎక్కడ లేదని టౌన్ ప్లానింగ్ అధికారుల పై ఏసీబీ, విజిలెన్స్ విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఇచ్చే లక్షలలో జీతాలు టౌన్ ప్లానింగ్ అధికారులకు సరిపోవడం లేదా వారి అక్రమ ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టి అక్రమ నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు వత్తాసు పలుకుతున్నారా.? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం ఇస్తున్నారంటే మున్సిపల్ శాఖ మంత్రి టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోరా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సర్కిల్ 18 ఏసిపి ఇంజ శ్రీనివాస్ పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ లో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించి అధికారులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని ప్రోత్సహించే అధికారులను సస్పెండ్ చేయకుండా పూర్తిగా ఉద్యోగాము నుండి తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జిహెచ్ఎంసిలో సమయపాలన లేకుండా ఇష్టానుసారంగా విధులకు హాజరై ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని సమయపాలన పాటించని గ్రేటర్ హైదరాబాద్ లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల అధికారులను రేవంత్ రెడ్డి ఎలా దారిలో పెడతాడో చూడాలి. ప్రతిపక్ష స్థానంలో ఉన్నప్పుడు అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని అధికారులపై ఒత్తిడి తెచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోకపోవడం వెనకాల అంతర్యం ఏమిటి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బంజారా హిల్స్, బేగంపేట సర్కిల్ లో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ ఉన్నత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేసి చూడాలి. టౌన్ ప్లాన్ సెక్షన్ ఆఫీసర్ ఇంజా శ్రీనివాస్ సెలవు పై వెళితే అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేయరా.? తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం లిఖితపూర్వకంగా ఆధారాలతో ఫిర్యాదు చేసిన కమిషనర్ కర్ణన్ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనకాల ఆంతర్యం ఏమిటో.?

# రహదారిపై భారీ అక్రమ షెడ్

- అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న దమ్మాయిగూడ మున్సిపల్ అధికారులు
- అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన చర్యలు తీసుకోరా.?
- కమిషనర్ కు డబ్బులు కనబడితే అక్రమ నిర్మాణాలు కనబడవా.?
- స్థానికులు ఫిర్యాదు చేసిన పట్టించుకోని మున్సిపల్ అధికారులు





**దమ్మాయి గూడ (ప్రశ్న న్యూస్)** దమ్మాయిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. విధులు నిర్వహించడంలో సాక్షాత్ కమిషనర్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు మున్సిపల్ అధికారులకు తెలిపిన పట్టించుకోవడంలేదని కాసులు కనబడితే టౌన్ ప్లానింగ్ అధికారులకు అక్రమ నిర్మాణాలు కనపడవా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రహదారి పైనే ఎలాంటి అనుమతులు లేకుండా ఓ భారీష్ షెడ్ నిర్మాణం జరుగుతుంటే లంచాలు తీసుకొని అధికారులు రాజకీయ నాయకుల పేరు చెప్పడం విడ్డూరంగా మారింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని దినపత్రికలో కథనాలు వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులకు సమాచారం అందించిన అక్రమ కట్టడాల వైపు తలెత్తి కూడా చూడడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలు చిన్న ఇల్లు కట్టుకుంటే చాలు నిబంధనలు అంటూ ఆగమాగం చేసి ఇల్లును కూలగొట్టే దాకా అక్కడి నుంచి కదలకుండా ఉండే టౌన్ ప్లానింగ్ అధికారులు రాజకీయ నాయకుల అండదండలతో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా భారీ షెడ్ అక్రమంగా నిర్మాణం చేస్తున్న అటువైపు తలెత్తి కూడా చూడడం లేదని సామాన్యుడికి ఒక న్యాయం డబ్బు రాజకీయ పలుకుబడి ఉన్నవాడికి ఒక న్యాయమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం మారిన అధికారుల కాసుల కక్కుర్తి మారలేదని అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న చర్యలు తీసుకొని అధికారులపై మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక టౌన్ ప్లానింగ్ అధికారులకు అక్రమ నిర్మాణాలు ప్రోత్సహించవద్దని పదేపదే తెలిపిన బిఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారులు కాసులకు కక్కుర్తి పడి ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించి దేవస్థానం భ్రష్టు పట్టించారు అధికారులు. ఇప్పటికైనా ఉన్నత అధికారుల్లో మార్పు రావాలని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించే కిందిస్థాయి అధికారుల పై రాజకీయ నాయకుల పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# అందరూ శంకర్ దాదా ఎం. బి.బి.ఎస్సు లే

- ఎం బి బి ఎస్ ను తలపిస్తున్న ఆర్ఎంపిలు వైద్యం
- ప్రీస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో మందుల అమ్మకాలు
- డబ్బు కోసం రోగులకు అవసరం లేని ల్యాబ్ టెస్టులు
- రోగుల నుండి అందిన కాడికి దోచుకోవడమే లక్ష్యం
- క్షేత్ర స్థాయిలో అధికారుల తనిఖీలు పూర్తిగా కరువు
- ప్రభుత్వ అనుమతులు లేని ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్ లు


shutterstock.com · 2488685625




మంథని ప్రతినిధి( ప్రశ్న న్యూస్) మంథనిలో అందరూ శంకర్ దాదా లే, ఎందుకంటే ఇక్కడ కొందరు ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించకుండా రోగులకు వైద్యం చేస్తున్నారు. అసలే వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున కొందరు ఆర్ఎంపిల వైద్యం ఎంబిబిఎస్ డాక్టర్లను తలపిస్తుంది. రోగుల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకోని అవసరంలేని ఆ టెస్టు ఈ టెస్టు అంటూ, ఇష్టం వచ్చినట్లు మందులు రాస్తూ దోచుకుంటున్నారు .కొన్ని మెడికల్ షాపుల్లో ప్రీస్క్రిప్షన్ లేకుండా మందులను ఇష్టం వచ్చినట్లు అమ్మకాలు జరుపుతున్నారు.రోగుల నుండి అందిన కాడికి దోచుకుంటు జేబులు నింపుకుంటున్నారు.ప్రభుత్వ అనుమతులు లేని ప్రైవేట్ ఆసుపత్రులు మంథనిలో నడుస్తున్నాయి. మంథనిలో పుట్ట గొడుగుల్లా ప్రైవేట్ ఆస్పత్రులు వస్తున్నాయి. ఓ మెడికల్ షాప్ లో జంతువుల, మనుషుల సంబంధించిన మందులు అమ్మడమే గాక అందులోనే ఆర్ఎంపితో రోగులకు చికిత్స చేస్తున్నారు.దీంతో రోగులకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. రోగుల అమాయకత్వన్నీ ఆసరగా చేసుకొని ఆడిందే ఆటగా పాడింది పాటగా దందా వ్యాపారన్నీ కొనసాగిస్తున్నారు. అవసరం లేని టెస్ట్ లు చేస్తూ మెడికల్ షాపులో మందులు రాస్తూ రోగుల దగ్గర నుండి కాడికి దోచుకుతుంటూ మెరుగైన వైద్యం కొరకు హైదరాబాద్, కరీంనగర్, మంచిర్యాల్ వరంగల్ లాంటి పట్టణ ప్రాంతాలకు పంపిస్తూ డబ్బులను దండుకుంటున్నారు. క్వాలిఫైడ్ లేని డాక్టర్ల, సిబ్బందిని పెట్టుకొని చిన్న పిల్లల ఆసుపత్రి లను సైతం నిర్వహిస్తూన్నారు. ఈ దందా వ్యాపారం కొన్నేళ్లుగా సాగిన కూడా అధికారులు మాత్రం అలా వచ్చి ఇలా వెళుతున్నరాని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. తనిఖీలకు వచ్చే ముందు ముందస్తు సమాచారం ఉండడంతో అనుమతులు లేని ప్రవేట్ ఆస్పత్రులు మూసివేస్తారు. అప్పుడు ఒకటి రెండు ఆసుపత్రులను అధికారులు అట్ల వచ్చి ఇట్ల తనిఖీ చేసినట్టు చెప్పుతూ వెళ్ళిపోతారు. జిల్లా వైద్య అధికారుల బృందం వైద్య అధికారిని ఇలా ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో యధావిధిగా మూసి ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు తెరుచూకుంటాయి. అధికారుల కనుసన్నల్లోనే అనుమతులు లేని ప్రవేట్ ఆస్పత్రులు , మెడికల్ షాపులు, ల్యాబ్ లు నడుస్తున్నాయనే స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా వైద్య అధికారులకు నెల నెల మామూలు ఇచ్చి ఇలా ప్రజలను దోచుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నత అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని స్థానికంగా ప్రజలు పలువురు కోరుతున్నారు.

# హైదరాబాద్ సిటీకి వరద ముప్పు





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** హైదరాబాద్ సిటీ జనానికి వరద ముప్పు పొంచి ఉంది. హిమాయత్ సాగర్ కు భారీగా వరదనీరు వస్తుండటంతో గురువారం రాత్రి 10 గంటలకు ఒక గేటు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసినట్టు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. మూసీనది దిగువ ప్రాంతాలను వరద నీరు ముంచెత్తే అవకాశం ఉందనీ, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. నది ఒడ్డున ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని అధికారులు సూచించారు. అన్ని విభాగాల అధికారులు పరిస్థితిని సమీక్షించేందుకు సిద్ధంగా ఉండాలని జీహెచ్ఎంసీ కోరింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగే అవకాశం ఉండటంతో జాగ్రత్తగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని జనానికి హెచ్చరికలు జారీ చేసింది. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం 040 – 211 11 111 లేదా 100కు డయల్ చేయాలని తెలిపింది.

### సిటీలో కుండపోత వాన

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో గురువారం కుండపోతగా వాన పడింది. సాయంత్రం టైమ్ లో భారీ వర్షం పడింది. ఈ వానలతో జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ నిండుకుండలుగా మారాయి. గచ్చిబౌలిలో అత్యధికంగా 12.3, శ్రీనగర్ కాలనీలో 11.1 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. యూసుఫ్ గూడ 10.4, ఖైరతాబాద్ – 10.8 ఉప్పల్ –9.5, ఎల్బీనగర్ 9.3, బంజారాహిల్స్ 9, నాగోల్ –8.5, గోల్కొండ 7.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం కూడా వానలు బాగానే పడతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588